తెలుగు దినపత్రిక

ninadam.in

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

గురువారం, ఏప్రిల్ 2, 2026 | సంపుటి - 22 | సంచిక 185 | వెల - 7 | పేజీలు - 12 - 8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

## 30వేల మంది టెక్కీల తొలగింపు

- ప్రపంచానికి ఒరాకిల్ భారీ కుదుపు
- అందులో 12వేమంది భారతీయులు

*అమెరికా టెక్ దిగ్గజం ఒరాకిల్ మంగళవారం ఒక్కసారిగా భారీ లేఆఫ్స్‌కు శ్రీకారం చుట్టింది. ప్రపంచవ్యాప్తంగా పనిచేస్తున్న సుమారు 1.62 లక్షల మంది సిబ్బందిలో 18 శాతం, అంటే దాదాపు 30,000 మందిని తొలగించినట్లు సమాచారం. వీరిలో ఏకంగా 12,000 మంది భారతదేశానికి చెందిన ఉద్యోగులే కావడం గమనార్హం. అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 6 గంటలకు వేలాది మంది ఉద్యోగులకు ఒకేసారి లేఆఫ్ మెయిల్స్ పంపించారు.*

▸▸తరువాయి 2లో..




## ఆటో ఎల్‌పీజీ కొరతపై కఠిన చర్యలు

**ప్రైవేట్ కంపెనీలకు సివిల్ సప్లైస్ కమిషనర్ హెచ్చరిక**



**హైదరాబాద్, ఏప్రిల్ 1(నినాదం):**

నగరంలో కొనసాగుతున్న ఆటో ఎల్‌పీజీ కొరత సమస్యపై ప్రభుత్వం కఠినంగా స్పందించింది. ఆటో డ్రైవర్ల జీవనోపాధి దెబ్బతినకుండా చర్యలు తీసుకునేందుకు సివిల్ సప్లైస్ శాఖ కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.సివిల్ సప్లైస్ భవన్‌లో జరిగిన ఈ సమావేశానికి ఏజిస్ గ్యాస్, సూపర్ గ్యాస్, గో గ్యాస్, టోటల్ ఎనర్జీస్, ప్రైమ్ గ్యాస్, ఎక్స్‌ట్రా గ్యాస్, యూని గ్యాస్ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్రంలో ఆటో ఎల్‌పీజీ మార్కెట్‌లో 80 శాతం వాటా కలిగిన ఈ సంస్థలు 110 అవుట్‌లెట్ల ద్వారా సరఫరా నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా వెల్లడైంది. సంక్షోభానికి ముందు, తర్వాత సరఫరా పరిస్థితులను సమీక్షించిన కమిషనర్, అందుబాటులో ఉన్న అన్ని మార్గాల ద్వారా వెంటనే ఎల్‌పీజీని సమీకరించి సరఫరా పెంచాలని ఆదేశించారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో కొరత నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.సరఫరా లోపం కొనసాగితే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. ప్రజా రవాణా అంతరాయం లేకుండా ఆటో డ్రైవర్లకు ఇంధనం అందుబాటులో ఉంచడం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యతగా పేర్కొన్నారు.మధ్యప్రాచ్య దేశాల్లో నెలకొన్న సంక్షోభం ప్రభావంతో అంతర్జాతీయ సరఫరా పరిమితులు ఏర్పడినట్లు అధికారులు తెలిపారు. గృహ వినియోగ ఎల్‌పీజీ సరఫరా సాధారణంగా కొనసాగుతున్నప్పటికీ, ఆటో ఎల్‌పీజీ విభాగంలో సుమారు 35 శాతం తగ్గుదల నమోదైందన్నారు.పరిస్థితిని సివిల్ సప్లైస్ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తూ, కేంద్ర ప్రభుత్వం, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలతో సమన్వయం చేస్తూ సమస్య పరిష్కారానికి చర్యలు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# నేటి నుంచి భూభారతి అమలు

**ఐదు మండలాల్లో ప్రయోగాత్మకం**

**అధికారులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి**

తెలంగాణలో భూ వివాదాలకు ప్రభుత్వం చెక్ పెట్టనుంది . ఏప్రిల్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భూభారతి సేవలు అమలు చేయనుంది. ప్రయోగాత్మకంగా 5 మండలాల్లో పోర్టల్ ప్రారంభం కానుంది. ఖమ్మం జిల్లా కూసుమంచి, భద్రాద్రి జిల్లా అశ్వరావుపేట, రంగారెడ్డి జిల్లా ఆమన్ గల్, సంగారెడ్డి జిల్లా వట్ పల్లి,నారాయణపేట జిల్లా కోస్గి మండలాల్లో భూభారతి అమలు సేవలు ప్రారంభం కానున్నాయి.






**హైదరాబాద్, ఏప్రిల్ 1(నినాదం):**

ఈ మేరకు పోర్టల్ ప్రారంభంపై బుధవారం అధికారులతో మంత్రి పొంగలేటి శ్రీనివాస్ రెడ్డి రివ్యూ నిర్వహించారు . ఈ సందర్భంగా భూభారతితో భూవివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ ఐదు మండలాల్లో వచ్చే ఫలితాలను బట్టి అవసరమైన మార్పులు చేసి, రెండో దశలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని చెప్పారు. ఎన్నికల హామీ మేరకు భూభారతి చట్టాన్ని తెచ్చామని తెలిపారు.

▸▸తరువాయి 2లో..



సోషల్ మీడియా వేదికగా

## వ్యతిరేక పోస్టులపై ఆంక్షలు

**బిల్లు తీసుకు రాబోతున్న కేంద్ర ప్రభుత్వం**

**న్యూఢిల్లీ, ఏప్రిల్1(నినాదం):**

సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెడితే.. ఇకపై చర్యలు తీసుకునేందుకు కేంద్రం సమాయత్తమవుతోంది. అలాంటి పోస్టులు పెట్టే వారికి నేరుగా కేంద్రం నోటీసులు జారీ చేయనుంది. అలాగే ఆ పోస్ట్‌ను షేర్ చేసే వారిపై సైతం కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపక్రమిస్తోంది. అందుకోసం దేశ భద్రత పేరిటి కొత్త ప్రతిపాదనలను కేంద్రం తీసుకు వస్తుంది. అందుకోసం ఐటీ రూల్స్ సవరణకు కేంద్రం ఇప్పటికే సిద్ధమైంది. దాంతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై సోషల్ మీడియా ఖాతాలో ఏదైనా వ్యతిరేక పోస్టు పెడితే ఇక చట్ట పరమైన శిక్షలు తప్పవు.

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు

## తీపి కబురు

- ఇక నేరుగా ఖాతాల్లో జీతాలు జమ చేయనున్న ప్రభుత్వం
- వేలాది మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరే అవకాశం



**హైదరాబాద్,ఏప్రిల్1(నినాదం):** 2

తెలంగాణ రాష్ట్రంలోని వేలాది మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక తీపి కబురు అందించింది. గత కొన్నేళ్లుగా వేతనాల చెల్లింపులో ఎదురవుతున్న తీవ్ర జాప్యం, మధ్యవర్తుల అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఏప్రిల్ నెల నుంచి ఈ ఉద్యోగులందరికీ నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోనే జీతాలు జమ చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.



అమరావతి బిల్లుకు

## లోక్‌సభ ఆమోదం

- సభలో బిల్లు ప్రవేశ పెట్టిన నిత్యానంద రాయ్
- చర్చలో పాల్గొన్న 11 పార్టీల ఎంపిలు
- ఏకగ్రీవంగా ఆమోదించిన సభ
- వైకాపా సభ్యుల వాకౌట్

2

### దోచుకోవడానికే అమరావతి ప్లాన్

- అబద్ధాలు, అడ్డగోలు సంపాదన బాబు నైజం
- రాష్ట్రానికి రాజధాని అన్నది ఎక్కడా లేదు
- కేంద్రానికి మాత్రమే రాజధాని అవసరం
- మావిజన్ అంటూ కొత్త ఆలోచన ప్రకటించిన జగన్

# బయటపడ్డ.. గజ్జెల బాగోతం

- పోలీసుల ఆకస్మిక తనిఖీలు
- దుర్గాభవాని రైస్ మిల్లులో నిల్వలు
- 9 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ పట్టివేత
- సిర్పూర్ ఠాణాకు తరలింపు





**కాగజ్ నగర్, ఏప్రిల్01(నినాదం):**

***కాగజ్ నగర్ కు చెందిన ఓ రైస్ మిల్లు బాగోతంబయటపడింది.అది రైస్ మిల్లు ముసుగులో నడుస్తున్న పక్కా రేషన్ మిల్లని తేలింది.కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ లోని ఓ 06 మిల్లులు రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్నాయని 'నినాదం' దినపత్రిక గత కొద్దిరోజులుగా వరుస కథనాలు ప్రచురించింది. అక్షరాలా అవన్నీ నిజమేనని తేలింది.***

**వివరాలిలాఉన్నాయి..**

సిర్పూర్ ఎస్సై డి సాగర్ నేతృత్వంలో టాస్కుఫోర్స్ బృందం బుధవారం రాత్రి దాడులు నిర్వహించింది.ఈ క్రమంలోమండలంలోని వేంపల్లిలోగల దుర్గాభవాని రైస్ మిల్లులో 09 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. అనంరం వాటిని తదుపరి విచారణ నిమిత్తం ఠాణాకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

### పెద్దమొత్తంగల వాహనం క్షణాల్లో మాయం..!

ఇలా ఉండగా ఈ దాడులకు కొద్ది క్షణాల క్రితమే పెద్దమొత్తం బియ్యం గల అసలు వాహనం మాయమైనట్లు సమాచారం.పట్టుబడిన బియ్యానికి సంబంధించి ప్రభుత్వ గోడౌన్ నుండి వచ్చిన గోనె సంచులే ఉండటం గమనార్హం. అంటే ఎం ఎల్ ఎస్ పాయింటు నుండో,లేక డీలర్ల నుండో ఈ బ్యాగులు నేరుగా సదరు మిల్లుకు వచ్చినట్లు ఈసీన్ స్పష్టం చేస్తోంది.

### పీడీ యాక్టు ప్రయోగించాలని డిమాండ్

ప్రభుత్వం ఇంత సీరియస్ గా ఉన్నా,మీడియా రోజూ వరుస కథనాలు రాస్తున్నా ఈ మిల్లు బాధ్యులు ఇంత బరితెగింపు ప్రదర్శిస్తున్నారంటే వారికి ఎవరెవరి అండ ఎంత ఉందో అర్థమవుతోంది. ఇలాంటి వారి కట్టడికి పీడీ యాక్టు వంటి కఠిన చట్టాలు ప్రయోగిస్తే తప్ప ఈ మాఫియాకు అంతం ఉండదని పలువురు అభిప్రాయపడుతున్నారు.



## పర్యవేక్షణ లోపం..

అంజన్న భక్తులకు శాపం.!

- చలువ పందిళ్లు కూలి.. భక్తులకు గాయాలు
- కొండగట్టు అంజన్న సన్నిధిలో ఘటన

5

రేషన్ కార్డుల తొలగింపు

## దుర్మార్గపు చర్య

- 5లక్షలు ఇచ్చామని చెప్పి 15లక్షలు తొలగించే కుట్ర
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ జాగృతి అధ్యక్షురాలు కవిత

2

**హైదరాబాద్,ఏప్రిల్1(నినాదం):**

రాష్ట్రంలో పేదలను రేవంత్ రెడ్డి సర్కార్ వేధిస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. రేషన్ కార్డుల విషయంలో పేదలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. రేషన్ కార్డుల ఏరివేత అనే దుర్మార్గపు చర్యలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయాలని కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై కవిత సీరియస్ అయ్యారు.



# యుద్ధం ముగింపునకు సిద్ధమే

- షరతులు వర్తిస్తాయన్న ఇరాన్
- ఇరాన్‌పై 800 సార్లు యుద్ధ విమానాల దాడి
- 16వేలకు పైగా బాంబులు వేసిన ఫైటర్లు
- వెల్లడించిన ఇజ్రాయిల్ మిలిటరీ శాఖ





**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 (నినాదం):**

అమెరికా` ఇజ్రాయెల్‌తో కొనసాగుతోన్న యుద్ధాన్ని ముగించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ పేర్కొన్నారు. అయితే, తమకు కొన్ని బలమైన హామీలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారని ఇరాన్ అధ్యక్ష కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. యుద్ధం ముగించాలంటే తాము విధించిన షరతులకు అంగీకరించాలని ఇరాన్ అధ్యక్షుడు పేర్కొన్నారు. ముఖ్యంగా భవిష్యత్తులో ఇలాంటి దాడులు పునరావృతం కావనే బలమైన హామీ ఇవ్వాలన్నారు. అప్పుడు ఈ యుద్ధం ముగించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు.

▸▸తరువాయి 2లో..

## రష్యాలో కుప్పకూలిన సైనిక విమానం

**29మంది దుర్మరణం చెందినట్లు ధృవీకరణ**

**మాస్కో, (నినాదం):** క్రిమియాలో ఘోర విమాన ప్రమాదం జరిగింది. రష్యాకు చెందిన సైనిక విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో 29 మంది దుర్మరణం చెందారు. ఆంటోనోవ్` 26 మోడల్‌కు చెందిన విమానం స్థానిక కాలమాన ప్రకారం మంగళవారం సాయంత్రం 6 గంటల కు క్రిమియా ద్వీపకల్పం మీదుగా వెళ్తోంది. అదే సమయంలో ఆ విమానానికి రాడర్‌తో సంబంధాలు తెగిపోయాయి. విమానం ఒక కొండను ఢీకొని కూలిపోయినట్లు తెలుస్తోంది.

▸▸తరువాయి 2లో..



## 30వేల మంది టెక్కీల తొలగింపు

**న్యూయార్క్,ఏప్రిల్1(నినాదం):**

కంపెనీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా వారి రోల్స్ అవసరం లేదని పేర్కొంటూ అమెరికా టెక్ దిగ్గజం ఒరాకిల్ తొలగింపు ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 31నే వారి చివరి పనిదినంగా ప్రకటించడంతో పాటు, కంపెనీ ల్యాప్‌టాప్‌లు, సిస్టమ్‌ల యాక్సెస్‌ను వెంటనే నిలిపివేయడం ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. ఈ లేఆఫ్స్ ప్రభావం భారత్‌పై తీవ్రంగా పడింది. ఒరాకిల్ ఇండియాలో సుమారు 30,000 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, వారిలో గణనీయమైన శాతం ఈ కోతలకు గురైనట్లు సమాచారం. అమెరికా, కెనడాలో తొలగించిన ఉద్యోగుల్లో కూడా పెద్ద సంఖ్యలో భారతీయులే ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మేనేజీరియల్ స్థాయిలో ఉన్న ఉద్యోగులే ఎక్కువగా ఈ వేటుకు గురైనట్లు సమాచారం. ఇది ఒక్క విడత మాత్రమేనని, ఇంకా మరిన్ని లేఆఫ్స్ ఉండే అవకాశం ఉందన్న వార్తలు ఉద్యోగుల్లో ఆందోళన పెంచుతున్నాయి. ఏ సమయంలోనైనా మరో చేదు వార్త వినాల్సి వస్తుందేమోనని ఐటీ ఉద్యోగులు టెన్షన్ పడుతున్నారు. ఒరాకిల్ ప్రస్తుతం నష్టాల్లో లేదు. ఇటీవల ముగిసిన త్రైమాసికంలో కంపెనీ లాభాలు గత ఏడాదితో పోలిస్తే 95శాతం పెరిగి 6.13 బిలియన్ డాలర్లకు చేరాయి. అయితే, కంపెనీ ఇప్పుడు ఏఐ డేటా సెంటర్ రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టుతోంది. సుమారు 156 బిలియన్ డాలర్ల ప్రాజెక్ట్ చేపట్టగా, అందులో భాగంగా ఇప్పటికే 50 బిలియన్ డాలర్లు అప్పు తీసుకుంది. ఈ నేపథ్యంలో ఖర్చులను తగ్గించేందుకు ఉద్యోగాల కోతలు విధిస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చర్యల ద్వారా కంపెనీకి దాదాపు 10 బిలియన్ డాలర్ల వరకు నగదు ఆదా అవుతుందని అంచనా. ఇక తొలగించిన ఉద్యోగులకు కంపెనీ కొన్ని పరిహారాలు ప్రకటించింది. అదనంగా మూడు నెలల జీతం,కంపెనీలో పని చేసిన ప్రతి ఏడాదికి 15 రోజుల జీతం, మిగిలిన సెలవులను నగదుగా మార్చుకునే అవకాశం,కార్మిక చట్టాల ప్రకారం గ్రాట్యుటీ.అయితే, ఈ ప్రయోజనాలు కంపెనీ నిర్దేశించిన గడువులోపు రాజీనామా చేసిన వారికే వర్తిస్తాయని పేర్కొన్నారు.

## నేటి నుంచి భూభారతి అమలు

, వ్యవసాయ భూముల క్రయవిక్రయాల సమయంలో సర్వే మ్యాపును జతపరిచే నిబంధనను కూడా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఐదు మండలాల్లో ప్రతీ సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలోనే భూధార్ నంబర్‌ను కేటాయించనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. ఇప్పటికే నక్ష లేని ఐదు గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసి, భూధార్ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఒక్క క్లిక్‌తో రైతుల భూములకు సంబంధించిన పూర్తి సమాచారం లభించేలా పోర్టల్‌ను రూపొందించామని, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్ ద్వారా లాగిన్ అయ్యి వివరాలు పొందవచ్చని చెప్పారు. ధరణిలో 36 మాడ్యూల్స్ ఉండగా.. వాటి గందరగోళానికి చెక్?పెడుతూ భూభారతిలో అన్నింటినీ ఒకే చాప్టర్ కిందకు తీసుకువచ్చినట్లు స్పష్టం చేశారు.

## సోషల్ మీడియా వేదికగా వ్యతిరేక పోస్టులపై ఆంక్షలు

ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా ఇకపై ఏదైనా పోస్ట్ చేస్తే, ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖల నుంచి నోటీసులు అందుకునే అవకాశం ఉంది. ఇక ఆన్‌లైన్ వేదికలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే యూజర్ల, కంటెంట్ క్రియేటర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లను సైతం న్యూస్ పబ్లిషర్లుగానే ఇకపై కేంద్రం చూడబోతున్నదన్నది స్పష్టం కానుంది. మైనా అభ్యంతరకర పోస్టులు పెడితే.. నేరుగా యూజర్లకే నోటీసులు పంపాలనే సమాలోచన కేంద్రం చేస్తోంది. ఈ మేరకు ఐటీ నిబంధనలతోపాటు 2021లో కొన్ని సవరణలు ప్రతిపాదిస్తూ సోమవారం కేంద్రం ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. దీనిపై ఏప్రిల్ 14వ తేదీ నాటికి అభిప్రాయాలు తెలియజేయాల్సి ఉందని కేంద్రం స్పష్టం చేసింది.

## కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తీపి కబురు

సాధారణంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా వేతనాలు అందుతుంటాయి. దీనివల్ల కమిషన్ల పేరిట కొంత మొత్తం కట్ అవ్వడమే కాకుండా, నెలల తరబడి జీతాలు రాక కార్మికులు ఇబ్బందులు పడేవారు. తాజా నిర్ణయంతో మున్సిపాలిటీలు, గురుకులాలు, విద్యా సంస్థలు, ఆరోగ్య శాఖ , మైనార్టీ సంక్షేమ శాఖల్లో పనిచేసే వేలాది మందికి లబ్ధి చేకూరనుంది. నేరుగా ఖాతాల్లో జమ కావడం వల్ల పారదర్శకత పెరుగుతుంది.ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులకు ప్రస్తుతం ఏ విధంగానైతే 'ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' ద్వారా జీతాలు అందుతున్నాయో, అదే విధానాన్ని కాంట్రాక్ట్ సిబ్బందికి కూడా వర్తింపజేస్తున్నారు. దీని కోసం ఇప్పటికే అన్ని జిల్లాల అధికారులు సిబ్బంది ఆధార్ కార్డులను వారి బ్యాంక్ ఖాతాలతో అనుసంధానం చేసే పక్రియను పూర్తి చేశారు. ఉన్నతాధికారులకు ఇందుకు సంబంధించిన డేటాను కూడా పంపడం జరిగింది. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు, టెక్నికల్ వర్కర్లు గతంలో అనేక కష్టాలు పడేవారు. స్థానిక పన్నులు వసూలైతేనే జీతాలు ఇస్తామనే నిబంధనలతో అధికారులు వారిపై ఒత్తిడి తెచ్చేవారు.టార్గెట్లు పూర్తికాకపోతే నెలల తరబడి వేతనాలు ఆగిపోయేవి. దీంతో కార్మికులు తమ నిత్యవసరాల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులపాలయ్యేవారు. ఇప్పుడు ప్రభుత్వం నేరుగా నిధులు విడుదల చేయనుండటంతో, పన్నుల వసూళ్లతో సంబంధం లేకుండా ప్రతి నెలా ఒకటో తేదీనే జీతం వచ్చే అవకాశం ఏర్పడింది.

## రేషన్ కార్డుల తొలగింపు దుర్మార్గపు చర్య

పేదలకు అన్యాయం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆగ్రహించారు. గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేదని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని కవిత విమర్శించారు. 5 లక్షల రేషన్ కార్డులు ఇచ్చామని చెప్పుకుంటూ.. మరోవైపు 15 లక్షల కార్డులు తొలగించే ప్రయత్నం జరుగుతోందని సంచలన ఆరోపణలు చేశారు. ఐటీ రిటర్న్స్ ఫైల్ చేయడం, ప్రైవేట్ ఉద్యోగాలు చేయడం వంటి కారణాలతో కార్డులు తీసేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు ఉపయోగపడే రేషన్ కార్డుల విషయంలో ఇలాంటి చర్యలు మానుకోవాలని హితవుపలికారు. కొండగట్టు చలువ పందిళ్ల ప్రమాదంపైనా కవిత స్పందించారు. పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. కొండగట్టు అంజన్న ఆలయంలో చలువ పందిళ్లు కూలి 15 మంది గాయపడడంపై విచారం వ్యక్తం చేశారు. హనుమాన్ చిన్న జయంతి వేడుకల కోసం నాసిరకం పందిళ్లు వేయడంతోనే ప్రమాదం జరిగిందని కవిత ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఉత్సవాల సమయంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. గాయపడిన భక్తులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలన్నారు. ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## మంగళ్‌హాట్ గోదాముపై దాడి

**హోటళ్లకు చచ్చిన మేకల మాంసం**

**కుళ్లిన పది టన్నుల మాంసం స్వాధీనం**

హైదరాబాద్ :
హైదరాబాద్ నగరంలో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న మరో కల్తీ మాంసం ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రెండు గోదాములపై మెరుపు దాడులు నిర్వహించి సుమారు 10 టన్నుల కుళ్లిన మాంసాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గోల్కొండ టాస్క్‌ఫోర్స్, హెచ్`ఫాస్ట్, జీహెచఎంసీ అధికారులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళ్‌హాట్‌లోని గోదాములపై దాడులు నిర్వహించగా, నిల్వ ఉంచిన భారీ మొత్తంలో ఈ కుళ్లిన మాంసం బయటపడింది.ఈ దందా వెనుక అఫ్రోజ్ అనే వ్యక్తి కీలలక సూత్రదారిగా వ్యవహరిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. నిందితుడు జమ్ముకశ్మీర్, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల నుంచి చనిపోయిన మేకలను తక్కువ ధరకు తెప్పించి, ఇక్కడ నిల్వచేస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ కుళ్లిన మాంసాన్ని నగరంలోని వివిధ హోటళ్లు, బిర్యానీ సెంటర్లకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడు అఫ్రోజ్‌తో పాటు మొత్తం నలుగురిని అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. ఈ ఘటనలో సదరు గోదాములను సీజ్ చేసిన అధికారులు.. నమూనాలను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. నిందితులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇటీవల నగరంలో వరుసగా బయటపడుతున్న ఇలాంటి కల్తీ దందాల పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బయట ఆహారం తినేటప్పుడు, మాంసం కొనుగోలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# యుద్ధం ముగింపునకు సిద్ధమే



ఇరాన్ అధ్యక్షుడితో జరిగిన సంభాషణ తర్వాత ఆంటోనియో కోస్టా సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా ఉందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు గల్ఫ్ దేశాలపై ఇరాన్ ప్రతీకార దాడులను తగ్గించుకోవాలని కోరారు. దౌత్య మార్గాలతో సమస్యను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా హార్ముజ్ జలసంధిని తిరిగి తెరవడం గురించి ప్రస్తావించారు. అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ నుంచి తనకు నేరుగా సందేశాలు అందుతున్నాయని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ పేర్కొన్నారు. అయితే, ఆ దేశంతో చర్చలు జరుపుతున్నామనేది దాని ఉద్దేశం కాదన్నారు. మీడియాతో మాట్లాడుతూ.. కొన్ని సందేశాలు మధ్యవర్తుల ద్వారా కూడా వచ్చాయన్నారు. యూఎస్‌తో తాము ఎలాంటి అధికారిక చర్చలు జరపడం లేదని.. ఆ దేశం చేసిన ప్రతిపాదనలపై తాము ఇంకా స్పందించలేదని వెల్లడించారు. కాల్పుల విరమణకు తాము అంగీకరించమని.. యుద్ధం ముగింపును మాత్రమే తాము కోరుకుంటున్నామని అరాగ్చీ స్పష్టం చేశారు.

**ఇరాన్‌పై 800 సార్లు యుద్ధ విమానాల దాడి**

దాదాపు నెల రోజులకు పైగా ఇరాన్, దాని మిత్ర దేశాలపై అమెరికా సహకారంతో ఇజ్రాయెల్ విరుచుకు పడుతోంది. ఈ దాడులకు సంబంధించిన వివరాలను తాజాగా ఐడీఎఫ్ పంచుకుంది. యుద్ధం ప్రారంభమైన నాటినుంచి ఇప్పటివరకు 800 సార్లు తమ యుద్ధ విమానాలు ఇరాన్ పైకి దూసుకెళ్లాయని ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. ఈ ఫైటర్‌జెట్లు 16వేలకు పైగా బాంబులను జారవిడిచినట్లు తెలిపింది. ఇరాన్ ప్రముఖ నాయకులు, మిలిటరీ కమాండర్లు, హెడ్‌క్వార్టర్లు, అణు స్థావరాలు, ఆయుధ తయారీ కేంద్రాలు, బాలిస్టిక్ క్షిపణి లాంచర్లు, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను ధ్వంసం చేశాం. యుద్ధం మొదలైన నాటినుంచి 4వేల లక్ష్యాలపై 10వేలకు పైగా దాడులు చేశాం. దాదాపు 16వేల బాంబులను జారవిడిచాం. ఈ దాడుల్లో ఇరాన్‌కు చెందిన 2వేల మందికి పైగా సైనికులు, కమాండర్లు హతమయ్యారు. కేవలం 40 సెకన్లలోనే 40 మందికి పైగా సీనియర్ అధికారులను అంతమొందించాం అని ఐడీఎఫ్ వెల్లడించింది. మరో 5వేల కొత్త టార్గెట్లను కూడా గుర్తించినట్లు తెలిపింది. ఇరాన్, దాని అనుబంధ గ్రూప్‌లు తమపై బెదిరింపులకు పాల్పడుతున్నాయని, వాటిని అడ్డుకోవడమే తమ లక్ష్యమని ఐడీఎఫ్ పునరుద్ఘాటించింది. మరోవైపు అమెరికా సెంట్రల్ కమాండ్ కూడా యుద్ధంపై స్పందించింది. ఇరాన్‌లోని భూగర్భ లక్ష్యాలను కూడా ఛేదించినట్లు వెల్లడించింది.

**రష్యాలో కుప్పకూలిన సైనిక విమానం**

ప్రమాద సమయంలో విమానంలో 23 మంది సైనికులు, ఆరుగురు సిబ్బంది ఉండగా.. వారందరూ మృతిచెందారని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. సాంకేతిక సమస్య కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని ప్రాథమిక అంచనా వేసింది. విమానంపై దాడి జరిగింది అనడానికి ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేసింది. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకునేందుకు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపింది. ప్రమాదానికి గురైన ఆంటోనోవ్ ఎన్`26 విమానాలను 1960 చివరలో ప్రవేశపెట్టారు. వీటని సైనిక అవసరాలతో పాటు సరుకు రవాణాకు ఉపయోగిస్తుంటారు. అయితే ఈ మోడల్‌కు చెందిన విమానాలు గత కొన్నేళ్లుగా ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇదే ఏడాది దక్షిణ సూడాన్‌లో జరిగిన ప్రమాదంలో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. 2022లో ఉక్రెయిన్‌లో జరిగిన ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. 2020లో శిక్షణ విమానం కూలి 20 మంది మరణించారు.



# అమరావతి బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**సభలో బిల్లు ప్రవేశ పెట్టిన నిత్యానంద రాయ్**

**చర్చలో పాల్గొన్న 11 పార్టీల ఎంపిలు**

**ఏకగ్రీవంగా ఆమోదించిన సభ**

**వైసీపీ సభ్యుల వాకౌట్**





న్యూఢిల్లీ :
ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఏపీ పునర్విభజన చట్ట సవరణ పేరుతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. అనంతరం సుమారు రెండు గంటలపాటు దీనిపై చర్చ జరిగింది. తెదేపా, భాజపా, జనసేన, కాంగ్రెస్, వైకాపా, సమాజ్‌వాదీ సహా పలు పార్టీల ఎంపీలు చర్చలో పాల్గొన్నారు. అనంతరం బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ స్థానంలో ఉన్న తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రకటించారు.ఈ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు రానుంది. లోక్‌సభలో ఆమోదం పొందిన అనంతరం ఈ బిల్లు రాజ్యసభకు వచ్చినట్లు సెక్రటరీ జనరల్ ప్రకటించారు. గురువారం కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ దీన్ని రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మొదలు దాదాపు గంటసేపు బిల్లుపై చర్చ జరిగే అవకాశం ఉంది. అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలపడంతో ఈ బిల్లుకు ఆమోదం లభించింది. వైసీపీ మినహా మిగిలిన పార్టీలు బిల్లుకు మద్దతు తెలిపాయి. అమరావతి బిల్లుపై చర్చలో 11 పార్టీలకు చెందిన 18 మంది ఎంపీలు పాల్గొన్నారు. చర్చ తర్వాత అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ ప్రకటించారు. అమరావతి రైతుల త్యాగం అపారమైందని పలువురు ఎంపిలు అన్నారు. లోక్‌సభలో ఎంపీ మాట్లాడుతూ.. రైతుల త్యాగం ప్రపంచ చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. రైతు భూమి కేవలం ఆస్తి కాదని, అది వారి జీవితంతో సమానమన్నారు. తండ్రికి బిడ్డతో ఉండే అనుబంధం ఎలా ఉంటుందో రైతుకు భూమితో బంధం ఉంటుందని వివరించారు. నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణం కోసం, భావితరాల భవిష్యత్తు కోసం రైతులు తమ వ్యక్తిగత ప్రయోజనాలను పక్కన పెట్టి సుమారు 33 వేల ఎకరాల భూమిని రాజధాని నిర్మాణానికి స్వచ్ఛందంగా ఇచ్చారన్నారు. ఈ త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది తెలిపారు. వైసీపీ నేతలు అమరావతిని తక్కువ చేసి మాట్లాడారని మండిపడ్డారు. అమరావతి అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరుగుతున్న సమయంలో వైసీపీ సభ్యులు వాకఅవుట్ చేయడం దురదృష్టకరమన్నారు. ఇది రాష్ట్ర ప్రజల భావోద్వేగాలను అవమానించినట్లే పలువురు ఎంపిలు తెలిపారు.

## అమరావతికి చట్టబద్ధత ఐదుకోట్ల ఆంధ్రుల విజయం

**చంద్రబాబు దూరదృష్టి వల్లనే సాకారం**

**విషం చిమ్ముతున్న వారికి ప్రజలే గుణపాఠం చెబుతారు**

**అమరావతికి సహకరించిన మోడీ, అమిత్ షాలకు ధన్యవాదాలు**

**ఎక్స్ వేదికగా డిప్యూటి సిఎం పవన్ ట్వీట్**

అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు లోక్ సభ ఆమోదం తెలపడంతో ఏపీ ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్ర ప్రజలంతా గర్వించే క్షణాలివని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ చట్టబద్ధతతో అమరావతి శాశ్వత రాజధానిగా నిలుస్తుందని.. లోక్ సభలో ఈ బిల్లుకు మద్దతు తెలిపిన పార్టీలు, ఎంపీలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పవన్ ట్వీట్ చేశారు. అమరావతికి చట్టబద్ధత లభించడాన్ని జీర్ణించుకోలేక విషం చిమ్ముతున్న వారికి రాబోయే రోజుల్లో ప్రజలు బలమైన గుణపాఠం నేర్పిస్తారని మండిపడ్డారు. రాజధాని అమరావతికి తోడ్పాటును అందిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తన అపార అనుభవంతో.. అమరావతి ప్రజారాజధానిగా, భావితరాల అభివృద్ధికి కేంద్రంగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. 'లోక్ సభలో అమరావతి బిల్లు ఆమోదం పొందిన ఈ చారిత్రక సందర్భంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఐదు కోట్ల మంది పౌరులకు నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నా. ఈరోజు ఆంధప్రదేశ్ చరిత్రలో ఒక కీలక మలుపుగా నిలుస్తుంది. అమరావతిని ఏపీ ఏకైక, శాశ్వత రాజధానిగా ప్రకటిస్తూ అమరావతి బిల్లు ఆమోదం పొందడం ప్రజా సంకల్పం, సె ర్యం, ఆశయాలకు ప్రతిబింబంగా నిలుస్తోంది. అమరావతి నిర్మాణానికి పునాది వేసి అచంచలమైన నిబద్ధత కలిగిన సీఎం చంద్రబాబు దూరదృష్టితో కూడిన నాయకత్వాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. ఈ కలను సాకారం చేయడంలో నిరంతర మద్దతు అందించిన ప్రధాని మోదీ, ఎన్డీయే ప్రభుత్వానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. గత ప్రభుత్వపు తిరోగమన, ఏకపక్ష నిర్ణయాల వల్ల తలెత్తిన సవాళ్ల సమయంలో రాష్ట్ర ప్రజలు అద్భుతమైన ధైర్యాన్ని ప్రదర్శించారు. తమ ఆశయాలకు అనుగుణంగా స్థిరమైన ఎన్డీయే ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం ద్వారా ప్రగతి, స్థిరత్వానికి అనుగుణమైన భవిష్యత్తును ఎంచుకున్నారు. 'స్వర్ణ ఆంధ్ర`2047' కలను సాకారం చేయడంలో అమరావతి కీలకపాత్ర పోషిస్తుందని, అలాగే ప్రధాని మోదీ 'వికసిత్ భారత్` 2047' లక్ష్యానికి గణనీయమైన తోడ్పాటును అందిస్తుందని దృఢంగా విశ్వసిస్తున్నా' అంటూ పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు.

## అమరావతి బిల్లును స్వాగతించిన మంత్రి పొన్నం

**తెలంగాణ హామీలు అమలు చేయాలని డిమాండ్**

హైదరాబాద్, : ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లు.. లోక్‌సభలో ఆమోదం పొందడాన్ని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతించారు. ఏపీ ప్రజలకు అభినందనలు తెలిపారు. రాజధాని నిర్మాణం ద్వారా ఎపి పురోగమించాలని ఆకాంక్షించారు. తెలంగాణకు ఇచ్చిన విభజన హామీలను కూడా వెంటనే అమలు చేయాలని కేంద్రానికి డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ఇచ్చిన హామీల అమలులో కేంద్రం వివక్ష చూపుతోందని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం వంటి హామీలను ఇప్పటికీ నెరవేర్చలేదు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు వంటి అంశాల్లో కూడా కేంద్రం మాట తప్పింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ విభజన చట్టంలో పొందుపరిచిన అన్ని హామీలను కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని మంత్రి పొన్నం డిమాండ్ చేశారు.

## తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమాకారులను కాంగ్రెస్ కాల్చిచంపింది

**అమరావతిపై చర్చలో కిషన్ రెడ్డి వ్యాఖ్యలు**

**నిరసన వ్యక్తం చేసిన కాంగ్రెస్ ఎంపిలు**

**తెలంగాణ విభజన హామీలు నెరవేర్చాలన్న ఎంపి వంశీ**

**న్యూఢిల్లీ,ఏప్రిల్1(నినాదం):**

ఏపీ అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చ సందర్భంగా లోక్ సభలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి.1969 తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమాకారులను కాంగ్రెస్ కాల్చి చంపిందని వ్యాఖ్యానించారు. చివరి దశ ఉద్యమంలో కూడా 1200 మంది ఆత్మబలిదానాలతో తెలంగాణ వచ్చిందన్నారు. కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ ప్రజలు రాష్ట్రాన్ని సాధించుకున్నారన్న కిషన్ రెడ్డి.. సుదీర్ఘ పోరాటంతో తెలంగాణ కల సాకారమైందన్నారు. అయితే గత బిఆరఎస్, ప్రస్తుత కాంగ్రెస్ రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేశారని ఆరోపించారు. ఏపీలో ఏడు ఎయిర్ పోర్టులు ఉంటే.. తెలంగాణలో ఒక్కటే ఎయిర్ పోర్టు ఉందన్నారు. కాంగ్రెస్, బీఆరఎస్ వ్యవహార శైలితోనే తెలంగాణకు ఎయిర్ పోర్టులు రాలేదన్నారు. ఇప్పటికైనా తెలుగు రాష్ట్రాలు కలిసి అభివృద్దిలో ముందుకెళ్లాలని సూచించారు. అన్నదమ్ముల్లాగా అభివృద్దిలో ముందుకు సాగాలన్నారు. మోడీ అందిస్తున్న చేయత వల్ల తెలంగాణలో రైలు, రోడ్ల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయని అన్నారు. కిషన్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీలు అభ్యంతర తెలిపారు. కిషన్ రెడ్డి తన వ్యాఖ్యలను ఉపసంహరించు కోవాలన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాలన్నారు. విభజన హావి లను కేంద్రం నెరవేర్చాలన్నారు. బీజేపీ ఇచ్చిన బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలన్నారు. అంతకు ముందు మాట్లాడిన పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ తెలంగాణకు కేంద్రం బకాయిలు చెల్లించాలనన్నారు. ఏపీ చేపట్టిన బనకచర్లతో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. తెలంగాణకు రావాల్సిన 200 టీఎంసీల నీళ్లు ఏపీ డైవర్ట్ చేస్తుందని ఆరోపించారు. బనకచర్లతో వందలాది ఎకరాలు నీట మునుగుతదన్నారు. తెలంగాణ కష్టాల వి ద ప్రధాని మోదీ దృష్టిపెట్టాలన్నారు. పెద్దపల్లి జిల్లాకు ఎయిర్‌పోర్టు మంజూరు చేయాలని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ అన్నారు. పెద్దపల్లి జిల్లాకు ఎయిర్ పోర్టు కోసం రిక్వెస్ట్ చేశామన్నారు. పెద్దపల్లి జిల్లాకు ఎయిర్ పోర్టు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాంలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు అంతర్గాం మండల కేంద్రంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం 591 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని ప్రభుత్వానికి ఇప్పటికే నివేదిక అందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అక్కడ ఎయిర్ పోర్టు నిర్మాణం సాధ్యమవుతుందా అనే విషయమై ప్రీ ఫిజిబులిటీ స్టడీ చేసేందుకు రూ.40.53 లక్షల ఫీజును ఎయిర్? పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియాకు చెల్లిస్తూ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ ఛీఫ్? సెక్రటరీ వికాస్? రాజ్ గతేడాదిలో ఉత్తర్వులు జారీ చేశారు.

# దోచుకోవడానికే అమరావతి ప్లాన్

**అబద్దాలు, అడ్డగోలు సంపాదన బాబు నైజం**

**రాష్ట్రానికి రాజధాని అన్నది ఎక్కడా లేదు**

**కేంద్రానికి మాత్రమే రాజధాని అవసరం**

**మావిగన్ అంటూ కొత్త ఆలోచన ప్రకటించిన జగన్**



అమరావతి, నినాదం:
చంద్రబాబు లాంటి వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం ఏపీ ప్రజలు చేసుకున్న దురదృష్టమని మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యాఖ్యానించారు. అమరావతి పేరుతో దోపిడీకి రంగం సిద్ధం చేశారని మండిపడ్డారు. అబద్దాలు, అడ్డగోలు సంపాదన చంద్రబాబుకు తెలిసిన విద్య అని అన్నారు. చంద్రబాబుకు నిజాయితీ, చిత్తశుద్ధి లేవని, ఆయన ద్రుష్టిలో పరిపాలన అంటే కేవలం అవినీతి, దోపిడీ మాత్రమేనని జగన్ దుయ్యబట్టారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై జగన్ నిప్పులు చెరిగారు. గత వారం శాసనసభలో అమరావతిపై ప్రవేశపెట్టిన తీర్మానం కేవలం ప్రజలను పక్కదోవ పట్టించే ప్రయత్నమని జగన్ విమర్శించారు. అసలు రాజ్యాంగంలో రాష్ట్రానికి 'రాజధాని' అనే పదమే లేదని, కేవలం దేశానికి మాత్రమే రాజధాని ఉంటుందని స్వయంగా మంత్రి పార్థసారథి చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా రాజధాని అనేది రాష్ట్రాల ఇష్టమని హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిందని, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు తమ రాజధానులను తామే నిర్ణయించుకున్నాయని తెలిపారు. అలాంటప్పుడు చంద్రబాబు ప్రభుత్వం ఈ తీర్మానాల పేరుతో ఎందుకు డ్రామాలు ఆడుతోందని జగన్ ప్రశ్నించారు. అమరావతి నిర్మాణ వ్యయంపై జగన్ పలు ఆసక్తికరమైన ప్రశ్నలు సంధించారు. గతంలో 50 వేల ఎకరాల్లో మౌలిక సదుపాయాలకు లక్ష కోట్లు అవుతుందని చెప్పిన చంద్రబాబు, ఇప్పుడు అదనంగా మరో 50 వేల ఎకరాలు ఎందుకు అడుగుతున్నారని నిలదీశారు. చదరపు అడుగుకు రూ. 11 వేల నుండి రూ. 14 వేల వరకు ఖర్చు అవుతుందని చెప్పడం వెనుక భారీ కుంభకోణం దాగి ఉందని ఆయన ఆరోపించారు. ఏ స్కాములు లేకపోతే అంత ఖర్చు ఎందుకు అవుతుంది? అభివృద్ధికి అవసరమైన రెండు లక్షల కోట్లు ఎక్కడి నుండి వస్తాయి? ఈ ప్రాజెక్ట్ ఎన్నేళ్లకు పూర్తవుతుందని ఆయన ప్రశ్నించారు. ఐదున్నర గంటల పాటు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఇలాంటి కీలక ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, కేవలం తనను , వైసీపీని దూషించడానికే సభను వాడుకున్నారని జగన్ మండిపడ్డారు. ఒకవైపు అసెంబ్లీని పిలిచిన ప్రభుత్వం, అదే చట్టసభలో భాగమైన కౌన్సిల్‌ను ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. కౌన్సిల్‌లో చంద్రబాబు అవినీతిని సభ్యులు కడిగిపారేస్తారనే భయంతోనే బాబు ఈ నిర్ణయం తీసుకున్నారని ఎద్దేవా చేశారు. భవిష్యత్తులో ఎవరూ రాజధానిని మార్చకుండా చట్టం తెస్తామన్న చంద్రబాబు వ్యాఖ్యలపై జగన్ స్పందిస్తూ.. అసెంబ్లీలో చట్టసవరణలు చేసే అధికారం సభకు ఉంటుందన్న విషయం బాబుకు తెలియదా అని ప్రశ్నించారు. తన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి, ప్రజల్లో సానుభూతి పొందడానికే చంద్రబాబు ఇటువంటి విన్యాసాలు చేస్తున్నారని, ఆయన అసలు రంగు ప్రజలందరికీ తెలుసని జగన్ స్పష్టం చేశారు. అమరావతి విషయంలో చంద్రబాబు ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును తప్పుబడుతూ జగన్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మాత్రం రాజధాని అమరావతిపై మరోసారి అక్కసు వెళ్లగక్కారు. పార్లమెంట్‌లో రాజధాని అమరావతిపై కీలక చర్చ జరిగే సమయంలో తాడేపల్లి ప్యాలెస్‌లో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మావిగన్ ప్లాన్`బి అంటూ ఏపీ రాజధానిపై మరోసారి జగన్ గందరగోళ ప్రకటన చేశారు. ఏపీ కోసం ప్రాక్టికల్‌గా ఆలోచించే వారికి మాత్రమే తాను చెప్పేది అర్థమవుతుందని అన్నారు. ప్లాన్`బి ప్రకారం విజయవాడ, మచిలీపట్నం, గుంటూరు ప్రాంతాలను కలిపి రాజధాని చేయాలని జగన్ అన్నారు. దీనికి మావిగన్ అని పేరు పెట్టాలన్నారు. అమరావతికి పెట్టే రూ.2 లక్షల కోట్లలో 10 శాతం పెడితే మావిగన్ భవిష్యత్తులో మంచి నగరం అవుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరును తప్పుపట్టారు వైసీపీ అధినేత. రాష్ట్ర రాజధాని అనేది పూర్తిగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని అంశమని చెప్పుకొచ్చారు.

# పర్యవేక్షణ లోపం...

**చలువ పందిళ్లు కూలి.. భక్తులకు గాయాలు**
**కొండగట్టు అంజన్న సన్నిధిలో ఘటన**

# అంజన్న భక్తులకు శాపం.!

**జగిత్యాల ప్రతినిధి ఏప్రిల్ 1 నినాదం**

పనిమంతులు పందిరి వేస్తే తోక తాకి కూలిపోయిందట.. కొండగట్టు చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా వేసిన చలువ పందిళ్ళ పరిస్థితి ఇలాగే తయారైంది. మంగళవారం రాత్రి చలువ పదిరి కూలి పందిరి కింద ఉన్న దాదాపు 15మంది భక్తులకు గాయాలయ్యాయి. ఏప్రిల్ ఒకటి నుంచి మూడు రోజులపాటు కొండగట్టు చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలకు తెలంగాణ చుట్టుపక్కల నుండి కాకుండ ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వస్తారు. ఎండాకాలం కావడంతో భక్తుల సౌకర్యం కోసం ఆన్లైన్ టెండర్ల ద్వారా చలువ పందిళ్ళ నిర్వహణ ప్రతీ ఏట జరిగే కార్యక్రమం. చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాల ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ రెండు రోజుల కేటాయించి పనులను పర్యవేక్షించారు. మంది మార్బలం పదుల సంఖ్యలో అధికారులు పోలీసులు ఆలయ సిబ్బంది పనుల పర్యవేక్షణ సమావేశంలో పాల్గొన్నారు. మంగళవారం అర్ధరాత్రి చిన్న గాలివానకే పందిరి కూలిపోవడంతో పందిరి కింద ఉన్న దాదాపు 15 మంది భక్తులకు గాయాలయ్యాయి. ఈ దుర్ఘటనను కప్పిపుచ్చడం కోసం జిల్లా ఉన్నతాధికారులతో పాటు





ఆలయ ఈవో సిబ్బంది నాన్న అవస్థలు పడుతూ మీడియా కళ్ళు కప్పే ప్రయత్నం చేశారు. కొండగట్టు ఆలయ ఈవో మాట్లాడుతూ అసలు ఎవరికి గాయాలు కాలేదని కేవలం పందిరి ఒరిగిందని కళ్ళ ముందు కనబడుతున్న సాక్షాన్ని తారుమారు చేసే ప్రయత్నం చేశారు. కేవలం పందిరి ఒరిగిందని జిల్లా అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పరిస్థితిని చూస్తుంటే జిల్లాలో అడ్మినిస్ట్రేషన్ ఏ పరిస్థితిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అక్రమార్కులకు దొంగలకు సద్ది కట్టే విధంగా ఫిర్యాదుదారులను భయపెట్టి పబ్బం గడుపుతున్న పరిస్థితులు కనబడుతున్నాయి. లక్షల రూపాయల టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవడం పక్కనపెట్టి పందిరి మీదపడి గాయపడిన భక్తులను పరామర్శించాల్సిన ఉన్నతాధికారులు అసలు దెబ్బలే తగలలేదు గాయాలు కాలేదని సమస్యను పూర్తిగా మసిపూసి మారేడు గాయ చేసే ప్రయత్నించడం జగిత్యాల జిల్లా ఉన్నతాధికారులకే దక్కుతుంది. రాజకీయ భజన అక్రమార్కులకు వెన్నుదన్నుగా జిల్లా యంత్రాంగం పనితీరును ప్రజలు ఆక్షేపిస్తున్నారు. కేవలం ప్రజాప్రతినిధుల సంతృప్తి పరచడమే విధులుగా చేసుకొని సామాన్య ప్రజల ప్రయోజనాలను గాలికి వదిలేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. దేవాలయం పరిసర ప్రాంతాల్లో 64 సీసీ కెమెరాలతో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండేలా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టారు . హెల్ప్ సెంటర్, ప్రత్యేక ఆరోగ్య కేంద్రాలు 6 ప్రదేశాల్లో ఏర్పాటు, ప్రత్యేక స్థలాల్లో భక్తుల సౌకర్యార్థం తాత్కాలిక టెంట్ ల ఏర్పాటు, మెట్ల దారి మార్గంలో లైటింగ్ ఏర్పాట్లు చేయనున్నట్లు అరకొర గానే ఉన్నాయి

## బందోబస్తుకు ఢోకా లేదు..!

ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి పోలీసు యంత్రాంగం చిన్న హనుమాన్ జయంతి నిర్వాణ కోసం విధుల్లో చేరారు. ఎస్పీ అశోక్ కుమార్ నేతృత్వంలో కొండగట్టు పరిసర ప్రాంతాల్లో పోలీసులు మోహరించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో ఎటు చూసినా పోలీసులు కనబడ్డారు. కొండగట్టు దిగువ ప్రాంతం నుంచి అంజన్న గర్భగుడి వరకు అడుగడుగున పోలీసులు దర్శనమిచ్చారు. హోంగార్డు కానిస్టేబుల్ నుంచి సిఐఎస్ఐ డిఎస్పి ల వరకు బుధవారం విధుల్లో ఉన్నారు. హనుమాన్ జయంతి ఉత్సవాల భద్రతకు వచ్చిన డోకా ఏమీ లేదనిపించింది. సౌకర్యాల కల్పన అంజన్న భక్తులకు శాపంగా పరిణమించింది. అధికారుల



అలసత్వం పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్టు కనబడ్డది. కొత్తగా విధుల్లో చేరిన ఆలయ ఈవో కూలిన చలువ పందిరిని ఆగమేఘాల మీద సరి చేసే కార్యక్రమం ముందటేసుకున్నారు. ఈ సందర్భంగా ఈవో ను పలకరిస్తే కలెక్టర్ గారు ఫోన్ చేస్తున్నారండి పందిరి సరిచేసి ఫోటోలు పెట్టమని అడుగుతున్నారు అని సమాధానం ఇవ్వడం కోసం మెరుపు.



## ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియ
# వేగవంతంగా చేపట్టాలి

**వారం రోజుల్లో లక్ష్య సాధనకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు**
**జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**

**కరీంనగర్, ఏప్రిల్ 1(నినాదం )**

జిల్లాలో ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని వారం రోజుల్లో సాధించేందుకు బూత్ స్థాయి అధికారులు, పర్యవేక్షకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమగ్ర పునర్విమర్శ కార్యక్రమం భాగంగా ఓటర్ మ్యాపింగ్ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ మండలాల్లో పనితీరును పరిశీలించి, పూర్తి శాతంపై వివరాలు సేకరించారు. వెనుకబడిన ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. బూత్ స్థాయి సిబ్బంది, ఆశ కార్యకర్తలు, అంగన్వాడి సిబ్బంది, వైద్య సిబ్బంది సమిష్టిగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించారు. ప్రతిరోజు పురోగతి నివేదిక అందించాలని, వారం తరువాత మరోసారి సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు.ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## తిరుమల క్షేత్రాన్ని దర్శించిన ఎమ్మెల్యే జారె

**దమ్మపేట, ఏప్రిల్ 1(నినాదం):**

అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారె ఆదినారాయణ కుటుంబ సమేతంగా కలియుగ దైవం పెద్ద తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి వారిని బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తన నియోజకవర్గం ప్రజలు మరియు రాష్ట్ర ప్రజల శ్రేయస్సు అభివృద్ధి కోసం ప్రార్థించారు.



## అర్ధరాత్రి దొంగల బీభత్సం!

**ఇంట్లో చొరబడి సొత్తు చోరీ చేసి పారిపోతుండుగా పట్టుకున్న బాధిత కుటుంబం... పోలీసులకు అప్పగించిన వైనం.!**

**పాలేరు ఏప్రిల్ 01( నినాదం)**



దొంగల బీభత్సవంతో ఒక్కసారిగా మండలం ఉలిక్కిపడింది. అర్ధరాత్రి ఇంట్లో చోరబడి.సొత్తు చోరీ చేసిపారిపోతుండుగా. బాధిత కుటుంబం దైర్యం చేసి.దొంగల ముఠాలో ఇద్దరు ను పట్టుకున్నారు. మరో ఇద్దరు పారిపోయారు.బాధితుల కధనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం లోని పైనంపల్లి లో మంగళవారం అర్ధరాత్రి దొంగలు భీభతవ్సం సృష్టించారు. గ్రామానికి చెందిన మల్లెల బ్రహ్మచారి కుటుంబం ఇంటి బయట నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి తరువాత నలుగురు దొంగలు ఇంటి చుటూ రెక్కీ నిర్వహించారు. ఇందులో ఇద్దరు దొంగలు మంచం కింద నుంచి దూరి ఇంట్లో చోరబడి వెండి.బంగారం చెవిదిద్దులు, సెల్ఫోన్ ను చోరీ చేశారు. అంతటి తో ఆగకుండా పక్కనే ఉన్న సీతారామయ్య ఇంట్లోకి చొరబడి బీరువా తీస్తుండుగా.అలికిడి కి బ్రహ్మచారి నిద్ర నుంచి లేచి చూసే సరికి దొంగలు కనిపించారు. భయంతో కేకలు వేయటంతో స్థానికులు మేల్కోని పరుగులు తీసి దొంగల వెంటపడ్డారు. నలుగురులో ఇరువురు దొరకకగా.మరో,ఇద్దరు,పరారయ్యారు.ఇరువురు స్థానిక పోలీసులకు అప్పగించారు. దొంగలు స్థానికులా.లేక అంతరాష్ట్ర ముఠా నా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారం రోజుల క్రితమే స్థానిక దేవాలయంలో చోరబడి అభరణాలు చోరీ చేసిన ఘటన మరవకముందే దొంగల ముఠా గ్రామంలో ఆలజడి సృష్టించటంతో ప్రజలు భయంతో వణికిపోతున్నారు. పోలీసులు గస్తీ పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు.

### బంగారు గొలుసు చోరీ కి ప్రయత్నించిన వృద్ధుడు

**పట్టుకొని పోలీసులకు అప్పగించిన స్థానికులు**

**జమ్మికుంట, ఏప్రిల్ 1 (నినాదం)**



జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామంలో మంచినీరు అడిగి మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసు దొంగలించడానికి ఓ గుర్తు తెలియని వ్యక్తి ప్రయత్నించాడు.మండలంలోని మడిపల్లి శాంతినగర్ గ్రామాల మధ్యన ఓ మహిళ తన పంట పొలానికి నీళ్లు కడుతుండగా ఓ గుర్తు తెలియని వ్యక్తి మంచినీళ్లు కావాలని దగ్గరకు వచ్చి తన మెడలో ఉన్న వస్తువులతాడు దొంగలించేందుకు ప్రయత్నించగా ఆ మహిళ గట్టిగా కేకలు వేసింది. దీంతో స్థానికంగా ఉన్న ప్రజలు ఆ వ్యక్తిని పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. ఆ వ్యక్తి దగ్గర ఉన్న సంచిలో ఒక వాటర్ బాటిల్ తో పాటు కత్తెర దొరకడంతో పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. మధ్యాహ్న సమయంలోనే ఓ గుర్తు తెలియని వ్యక్తి దొంగతనం చేసేందుకు ప్రయత్నించగా ఆ గ్రామంలో పొలం పనులకు వెళ్లే మహిళలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పోలీసులు సైతం ఒంటరిగా ఉండే మహిళలు విలువైన ఆభరణాలు ధరించకుండా అప్రమత్తంగా ఉండాలని గుర్తు తెలియని వ్యక్తులు కనిపిస్తే తమకు సమాచారం అందించాలని సిఐ రామకృష్ణ గౌడ్ పేర్కొన్నారు.

## అంగన్వాడి కేంద్రాలను బలోపేతం చేయాలి





**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్**

**గద్వాల ప్రతినిధి ఏప్రిల్ 1 (నినాదం )**

అంగన్వాడి కేంద్రాలను బలోపేతం చేసేందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ కు ఎంపికైన గట్టు మండలంలో అంగన్వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించడంలో శిక్షణ ఫౌండేషన్ సహకారం అందిస్తుండడంతో బుధవారం గద్వాల వజ్రా బంకిట్ హాల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గట్టు బ్లాక్ లో ఉన్న ప్రతి అంగన్వాడి కేంద్రం నిర్వాహకులు బాధ్యతతో పనిచేస్తున్నారని, సంపూర్ణత అభయాన్ 2.0 లో.వంద శాతం లక్ష్యాలను సాధించాలన్నారు. అంగన్వాడి కేంద్రాల్లోని చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలన్నారు. అంగన్వాడి కేంద్రాల నిర్వహకులు పిల్లల మానసిక పరిస్థితిని అర్థం చేసుకుంటూ వారి బాగోగులను చూసుకోవడం ఎంతో ఓపికతో కూడుకున్న పనిగా పేర్కొన్నారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ విద్యను కూడా బోధించేలా చర్యలు తీసుకోవడంతో చిన్నారుల ప్రాథమిక విద్యకు ఆక్కడే నాంది పడుతుందన్నారు. బడిబాట మాదిరే అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య పెరిగేందుకు వేసవి సెలవుల్లో ప్రత్యేక కార్యాచరణతో పిల్లల తల్లిదండ్రులకు అవగాహన పెంపొందించాలన్నారు. అనంతరం శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన పలువురు అంగన్వాడీ కార్యకర్తలకు బహుమతులు, ధ్రువపత్రాలను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. అలాగే గట్టు మండలానికి చెందిన నలుగురు విద్యార్థులకు కలెక్టర్ శిక్షణ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో లాప్ టాప్స్ అందించారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యుఓ సునంద, ఎంపీడీవో చెన్నయ్య, సిడిపిఓ హేమలత, శిక్షణ ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ కాశీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

### నేడు నగరవ్యాప్తంగా వార్డు సభల
## నిర్వహణకు సన్నాహాలు పూర్తి

**నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్**

**కరీంనగర్, ఏప్రిల్ 1(నినాదం )**




ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 2న నగరవ్యాప్తంగా వార్డు సభలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులకు సూచించారు. ఈ మేరకు నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్, పారిశుధ్యం, పట్టణ ప్రణాళిక, ఆదాయం తదితర విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వార్డు సభల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, ప్రజల సమీకరణ, ముఖ్య అతిథుల ఆహ్వానం వంటి అంశాలపై చర్చించి, ప్రతి డివిజన్‌కు ఇన్‌చార్జ్ అధికారులను నియమించినట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు సభలు ప్రారంభమయ్యేలా, అవసరమైన చోట టెంట్లు, కుర్చీలు, తాగునీటి సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, యువకులు, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు, సంక్షేమ పథకాల లబ్ధిదారులు సభలకు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యుత్, విద్య, వైద్యం, ఆదాయం తదితర శాఖల అధికారులు కూడా పాల్గొనాలని సూచించారు.సభల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలు ప్రజలకు తెలియజేసి, లబ్ధిదారుల జాబితాలను చదవాలని, అలాగే నగరపాలక సంస్థ పన్నులు, అభివృద్ధి పనులపై వివరాలు అందించాలని చెప్పారు. ప్రజల నుంచి ఫిర్యాదులు, అభ్యంతరాలు స్వీకరించి, డివిజన్ వారీగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.నగరంలోని 66 డివిజన్లలో వార్డు సభలను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని కమిషనర్ సూచించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు, వైద్య ఆరోగ్యాధికారి, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత

**చైతన్య విశ్వవిద్యాలయ, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్ సాత్విక రెడ్డి**

**మాదకద్రవ్యాల నియంత్రణపై చైతన్య డీమ్డ్-టు-బి విశ్వవిద్యాలయ విద్యార్థుల, నృత్య ప్రదర్శన**

**చేవెళ్ళ ఏప్రిల్ 01(నినాదం):-**






యువతలో ప్రజారోగ్యానికి తీవ్రమైన ముప్పుగా మారుతున్న మాదకద్రవ్యాల దుర్వినియోగం ధూమపానం వలన కలిగే అనర్థాలపై కల్పించడమే ప్రధాన ఉద్దేశమని, చైతన్య డీమ్డ్ – టు – బి విశ్వవిద్యాలయ డైరెక్టర్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సి.హెచ్. సాత్విక రెడ్డి తెలిపారు.బుధవారం చేవెళ్ల నియోజకవర్గం మొయినాబాద్ మండల పరిధిలోని, హిమాయత్‌నగర్ చైతన్య డీమ్డ్–టు–బి విశ్వవిద్యాలయ విద్యార్థులు, హైదరాబాద్ నగరంలోని ప్రముఖ కూడళ్లలో ఫ్లాష్ మాబ్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతలో ప్రజారోగ్యానికి తీవ్రమైన ముప్పుగా మారుతున్న మాదకద్రవ్యాల దుర్వినియోగం ధూమపానం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశమని అన్నారు.ప్రజల దృష్టిని ఆకర్షించేందుకు ఈ ఫ్లాష్ మాబ్ ప్రదర్శనలు సంగీతం, నృత్యం ప్రభావవంతమైన దృశ్య సందేశాల సమ్మేళనంగా సాగాయి. ఒకే విధమైన దుస్తులు ధరించిన విద్యార్థులు సాధారణ పాదచారుల్లా కనిపిస్తూ, ఒక్కసారిగా సమకాలీన నృత్య ప్రదర్శనలలోకి మారడం ద్వారా మాదకద్రవ్యాల సమస్య సమాజంలో ఎలా దాగి ఉందో ప్రతిబింబించారు..“మాదకద్రవ్యాలు వద్దు”, “ధూమపానం వద్దు” వంటి బలమైన నినాదాలతో కార్యక్రమాన్ని ముగించారు. ఈ నినాదాలు రద్దీ కూడళ్లలో మార్మోగి, పెద్ద సంఖ్యలో ప్రజలను ఆకర్షించాయి. వినోదాత్మక ప్రదర్శనలతో పాటు, ఈ కార్యక్రమం లోతైన సామాజిక సందేశాన్ని కూడా అందించింది. ప్లకార్డులు, హావభావాలు, అభినయాల ద్వారా వ్యసనాల వల్ల కలిగే శారీరక, భావోద్వేగ సామాజిక ప్రభావాలను విద్యార్థులు స్పష్టంగా ప్రతిబింబించారు.మాదకద్రవ్యాలు ధూమపానం కుటుంబాలను ఎలా దెబ్బతీస్తాయో, వ్యక్తిగత జీవితాన్ని వృత్తిని ఎలా ప్రభావితం చేస్తాయో వివరించారు. అలాగే, తోటివారి ఒత్తిడిని ఎదుర్కొనే సామర్థ్యం, సరైన నిర్ణయాలు తీసుకోవడం, అవసరమైనప్పుడు సహాయం కోరడం వంటి అంశాల ప్రాముఖ్యతను విద్యార్థులు తెలియజేశారు. ప్రజల భాగస్వామ్యం విశేషంగా కనిపించింది. అనేక మంది ప్రయాణికులు తమ ప్రయాణాలను ఆపి ప్రదర్శనను వీక్షించడం, వీడియోలు తీయడం, విద్యార్థులతో సంభాషించడం జరిగింది. సాంప్రదాయ అవగాహన కార్యక్రమాల కంటే ఇటువంటి ప్రత్యక్ష ప్రదర్శనలు మరింత ప్రభావవంతంగా ఉంటాయని పలువురు అభిప్రాయపడ్డారు. విద్యార్థుల సృజనాత్మకతను కృషిని అధ్యాపక బృందం, విశ్వవిద్యాలయ అధికారులు అభినందించారు. విద్యాసంస్థలు కేవలం విద్యాబోధనకే పరిమితం కాకుండా, సామాజిక స్పృహ కలిగిన పౌరులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని వారు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సామాజిక సమస్యలపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు విశ్వవిద్యాలయం కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు అసిస్టెంట్ రిజిస్ట్రార్ & పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ గాదె రాంబాబు రెడ్డి పాల్గొన్నారు.

## ప్రజల ఎజెండాయే కాంగ్రెస్ ఎజెండా

**కోరుట్ల నియోజకవర్గం ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు**



**కోరుట్ల, ఏప్రిల్ 1 (నినాదం):**

బడుగు, బలహీన, అట్టడుగు వర్గాల ప్రజల ఎజెండాయే కాంగ్రెస్ పార్టీ ఎజెండాగా పెట్టుకొని పని చేస్తుందని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజక వర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు స్పష్టం చేశారు. కోరుట్ల పట్టణంలోని 6వ వార్డు కౌన్సిలర్ మేడిపల్లి శిరీష శేఖర్ రెడ్డి కార్యాలయం కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ తో కలిసి కాంగ్రెస్ నియోజక వర్గం ఇంచార్జి జువ్వాడి నర్సింగ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజక వర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగ రావు మాట్లాడుతూ ప్రజలకు ఏ సమస్యలున్నా కౌన్సిలర్ దృష్టికి తీసుకొస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు. ప్రజా సంక్షేమం ప్రభుత్వం ఎజెండా పెట్టుకొని పని చేయాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్, వైస్ చైర్మన్ షాహిద్ ఉల్ అహ్మద్,స్థానిక వార్డు కౌన్సిలర్ మేడిపల్లి శిరీష శేఖర్ రెడ్డి, పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడ పట్టణాభివృద్ధికి సహకరించాలి

**ఫుట్ పాత్ లపై వ్యాపారాలు నిర్వహించరాదు**
**స్వతహాగా ఈనెల 15లోగా విగ్రహాలు తొలగించుకోవాలి**
**సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి**

**మిర్యాలగూడ ఏప్రిల్ 1 (నినాదం ):**




మిర్యాలగూడ పట్టణ అభివృద్ధికి అందరు సహకరించాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి కోరారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ మాట్లాడుతూ మిర్యాలగూడను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా నిధులు మంజూరు చేసిందని, ఆయా పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అందరి సహకారం అవసరమన్నారు. మిర్యాలగూడ పట్టణంలో ఎన్. హెచ్, పనులు అమృత్, సిసి రోడ్లు, అండర్ డ్రైనేజ్ పనులు, సెంట్రల్ లైటింగ్, పనులు వేగంగాజరుగుతున్నాయన్నారు. రాబోయే రెండు సంవత్సరాలలో మిర్యాలగూడ అభివృద్ధిలో ముందంజలో ఉంచేందుకు గాను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఫుట్ పాత్ లపై ఎలాంటి వ్యాపారాలు నిర్వహించరాదన్నారు. (ఫుట్ పాత్) డ్రైనేజీల వెనుక భాగంలో బండిలు పెట్టాలన్నారు. ఈదుల గూడ నుంచి హనుమాన్ పేట వరకు ఫుట్ పాత్ లను వ్యాపారాలు గాని వాహనాలు నిల్పరాదన్నారు. అలా చేసినచో చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అదేవిధంగా హనుమాన్ పేట బైపాస్ నుంచి ఈదుల గూడ బైపాస్ వరకు 17 విగ్రహాలు ఉన్నాయని, ఆయా విగ్రహాలను తీసివేసేందుకు సంఘాలు స్వతహాగా ఈ నెల 15 వరకు ముందుకు రావాలన్నారు. లేనిపక్షంలో మున్సిపల్ శాఖ నేతృత్వంలో అన్ని విగ్రహాలను ఒకే చోట అందరికీ ఉపయోగకరమైన స్థలంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా పరిహారం తీసుకుని వారు వెంటనే తీసుకొని జాతీయ రహదారి పనులకు సహకరించాలన్నారు. టాకా రోడ్డు, చర్చి రోడ్డు, ప్రైవేట్ హాస్పటల్ రోడ్డు మాస్టర్ ప్లాన్ ప్రకారం 40 ఫీట్లను చేసేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టామన్నారు. మున్సిపల్ కమిషనర్ జి శ్రీనివాస్ మాట్లాడుతూ రోడ్డు వెడల్పు పనులకు ప్రజలు సహకరించాలని కోరారు. కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం పట్టణంలోని టాకా రోడ్డు చర్చి రోడ్డు విస్తరణ పనులు త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు. మున్సిపల్ నిబంధన ప్రకారం షాపు యజమానులు పార్కింగ్ స్థలం వదిలి మెట్లు నిర్మించుకోవాలన్నారు. మిర్యాలగూడ డి.ఎస్.పి కె రాజశేఖర్ రాజు మాట్లాడుతూ ట్రాఫిక్ నియమ నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. మిర్యాలగూడ పట్టణంలో రాత్రి 10 గంటల వరకు షాపులు, హోటల్ మూసివేయాలని, మిర్యాలగూడ హైవే వద్ద గల హోటల్ లు రాత్రి 12:30 వరకు మూసివేయాలని, రాత్రి వేళలో హైవేపై నుంచి వెళ్తున్న వాహనాలకు "టీ" సౌకర్యం ఎంపిక చేసిన టీ స్టాల్ లో ఉంటాయన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మైనర్లకు వాహనాలు ఇచ్చినట్లయితే తల్లిదండ్రుల లైసెన్స్ రద్దు చేయడంతో పాటు జరిమానా చర్యలు తీసుకుంటామన్నారు. పుట్టినరోజు వేడుకలు రోడ్డుపై నిర్వహిస్తే చర్యలు తప్పవు అన్నారు. సైలెన్సర్ తీసివేసి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే 24 కేసులు నమోదు చేశామన్నారు.

సంపాదకీయం

# ట్రంప్ చితిమంటల్లో ప్రపంచం విలవిల!

పశ్చిమాసియా యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో అంతుచిక్కడం లేదు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. అయితే ఈ యుద్ధం వల్ల ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతున్నా అగ్రరాజ్యం అమెరికా పట్టించుకోవడం లేదు. అమెరికా షరతులకు లొంగేది లేదని ఇరాన్ కరాఖండిగా చెప్పడంతో ఎటు వెళుతుందో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. పరిస్థితి ఇలాగే ఉంటే పశ్చిమాసియా సంక్షోభంతో ప్రపంచంలో తలెత్తే ఆర్థిక సమస్యల గురించి చర్చ మొదలైంది. నెల రోజులు దాటిన యుద్ధంతో చమురు నుంచి ఆహారం వరకు ప్రభావితం అవుతున్నాయి. అమెరికాకు మంగళవారం నాటి వరకు 36 బిలియన్ డాలర్లకు పైగా నష్టం జరిగింది. ప్రతి సెకనుకు 11,574 డాలర్లు ఖర్చు అవుతున్నాయి. ట్రంప్‌కు వ్యతిరేకంగా అమెరికాలో గడచిన తొమ్మిది నెలల్లో మూడుసార్లు అక్కడి కార్మికవర్గం ప్రదర్శనలు చేశారు. ఎవరినైనా అదుపులోకి తెచ్చుకోవాలంటే అంతర్జాతీయ సూత్రాలను పక్కన పెట్టు, జనం మీద బాంబులు వేసి చంపు, దేశాలను నాశనం చేయి, అప్పుడు జనం నిరాశతో లొంగిపోతారనే అమెరికా అనుసరిస్తున్న విధానం ప్రపంచ దేశాలకు గుదిబండగా మారాయి. అమెరికా అడుగుజాడల్లో నడుస్తున్న ఇజ్రాయిల్ కూడా రెచ్చిపోవడం దారుణం. ఇదే క్రమంలో భారత ఆర్థిక వ్యవస్థ దిగజారుతుండటం ఆందోళనకరం. మన ఆర్థిక వ్యవస్థ త్వరలోనే ఐదు ట్రిలియన్ డాలర్ల మైలురాయిని చేరుకుంటుందన్న మోడీ లక్ష్యానికి గండిపడినట్లే. ఎందుకంటే మన ఆర్థిక వ్యవస్థ కూడా ప్రపంచ దేశాల మీద ఆధారపడి నడుస్తోంది. దీనికితోడు చమురు దిగుమతులపై ప్రభావం కారణంగా దేశంలో ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా తయారయ్యింది. చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ 95కి పడిపోయింది. నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చేనాటికి 2013లో డాలర్‌తో రూపాయి విలువ పోలిస్తే 62గా ఉండేది. రూపాయి విలువ అత్యంత ప్రమాదకర స్థాయికి చేరిందని అప్పట్లో నిర్మలా సీతారామన్, మోడీ విమర్శించారు. ఇప్పుడు అంతా బాగుందని పార్లమెంట్ సాక్షిగా ఆర్థిక మంత్రి ప్రకటించడం విడ్డూరం. డాలర్ పడిపోతున్న సమయంలో సైతం రూపాయి విలువ దిగజారడం, ఆసియా లోనే అత్యంత అధ్వాన స్థితికి చేరుకోవడం కేంద్రం వైఫల్యాన్ని చాటిచెప్పేదే. పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావంతో ఆర్థిక సూచీల వృద్ధి మందగించిందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ తన తాజా నివేదికలో ప్రకటించింది. వాస్తవానికి యుద్ధం ప్రారంభానికి ముందే మన ఆర్థిక వ్యవస్థ ఆందోళనకర స్థితిలో ఉంది. దేశీయ ముడి చమురు పరిశ్రమ గత 24 నెలల్లో 20 నెలలు కుంచించుకుపోయింది. ప్రస్తుత ఎల్‌పిజి, పెట్రో ఉత్పత్తుల సంక్షోభానికి, తద్వారా ఆర్థిక రంగానికి ముప్పుగా పరిణమించిందనేది నిర్వివాదాంశం. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రెండంకెల స్థాయిలో క్షీణిస్తున్నాయి. ఎగుమతులు గత కొన్ని నెలలుగా 5 శాతం నుండి 7 శాతం ప్రతికూల వృద్ధిని నమోదు చేస్తున్నాయి.సరుకుల ఎగుమతులు 0.8 శాతం పతనమై 36.61 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. పశ్చిమాసియా సంక్షోభం, అమెరికా విధిస్తున్న కొత్త టారిఫ్‌లు భారత తయారీ రంగానికి, ముఖ్యంగా ఐటి, ఫార్మా ఎగుమతులకు గొడ్డలి పెట్టుగా మారాయి. ఉత్పత్తికి డిమాండ్ తగ్గిపోయిందని ఈ గణాంకాలన్నీ చెబుతూనే ఉన్నాయి. కేంద్రం చెబుతున్నట్టు 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని చేరుకోవాలంటే దేశ జిడిపి కనీసం 8 నుండి 9 శాతం స్థిరమైన వృద్ధిని నమోదు చేయాలి. వాస్తవంగా 5 శాతానికి మించదనేది నిపుణుల వాదనగా ఉంది. స్టాక్ మార్కెట్‌కు ఈ యేడాది 'బ్లాక్ ఇయర'గానే మిగిలిపోయింది. లక్షల కోట్ల సంపద ఆవిరైంది. విదేశీ పెట్టుబడిదారులు గత ఏడాది కాలంలో రూ.1.80 లక్షల కోట్ల నిధులను వెనక్కి తీసుకోవడం మార్కెట్లను అగాథంలోకి నెట్టేసింది. పశ్చిమాసియాలో అమెరికా` ఇజ్రాయిల్ రుద్దిన యుద్ధం మనదేశాన్ని గణనీయంగా దెబ్బతీసింది.ద్రవ్యోల్బణం, నిరుద్యోగం సామాన్యుల జీవితాలను అల్లకల్లోలం చేస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.2 శాతానికి ఎగిసి 10 నెలల గరిష్ట స్థాయికి చేరుకోవడం ప్రమాద ఘంటికగా చూడాలి. ప్రస్తుత ఆర్థిక వ్యవస్థ విద్యావం తులకు సరిపడా ఉద్యోగాలను సృష్టించలేక పోతోంది. ప్రభుత్వ విధానాలు కొన్ని కార్పొరేట్ సంస్థల లాభాలకూ, కుబేరుల సంపద పెరుగుదలకూ ఉపయోగపడుతున్నాయి. అసమానతలు తీవ్రమవుతున్నాయి. సామాన్యులు, మధ్యతరగతి వర్గాలు దారిద్ర్యంలోకి నెట్టబడుతున్నారు. ప్రజల కొనుగోలు శక్తి పడిపోవడం, చిన్న పరిశ్రమలు కునారిల్లడం ఇందుకు నిదర్శనం. వాస్తవ సమస్యలను గుర్తించి పరిష్కరించినప్పుడే దేశానికి నిజమైన ఆర్థిక పురోగతి సాధ్యం. ఇరాన్‌పై దాడుల తరువాత అనేక దేశాల్లో స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. వాటి విలువ ఎంత అన్నది స్పష్టంగా చెప్పలేము. మన దేశంలో రూ.51 లక్షల కోట్లు నష్టపోయినట్లు అంచనా, ఇంకా పతనం కొనసాగితే నష్టాలు పెరుగుతాయి. ఈ ఏడాది చివరి నాటికి అమెరికా మాంద్యంలోకి వెళ్లేందుకు 37 శాతం అవకాశాలున్నట్లు పోలీ మార్కెట్ అంచనా వేసింది. కార్పొరేట్ కంపెనీలు పెరిగిన ఖర్చులను వినియోగదారుల మీద మోపితే ద్రవ్యోల్బణం పెరుగు తుంది, పెట్టుబడులు పెట్టేవారు ఆచితూచి అడుగేస్తారు, నియామకాలు తగ్గిపోతాయి. పశ్చిమాసియా సంక్షోభాన్ని ట్రంప్ ఎలా ముగిస్తాడో తెలియదు. స్వస్తి పలకటం అనివార్యం, అయితే అది అమెరికా నిర్దేశించినట్లు కాదు. ఇప్పుడు ఇరాన్ తన షరతులను ముందుకు తెస్తున్నది, ఇది ట్రంప్ కలలో కూడా ఊహించి ఉండదు.

## ప్రజాస్వామ్యం అంటే 'ప్రశ్నించే హక్కు'..

# శిక్షలు కేవలం ప్రజలకేనా?

### పాలకులకు లేని నిబంధనలు.. పౌరులకు మాత్రం సంకెళ్లా?

భారత రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛ నేడు ఒక సంధి కాలంలో ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును విమర్శిస్తేనో, సోషల్ మీడియాలో పోస్టులు పెడితేనో చట్టపరమైన చర్యలు, అరెస్టులు వెనువెంతనే జరిగిపోతున్నాయి. కానీ, అదే రాజ్యాంగం పౌరులకు ఇచ్చిన హామీలు నెరవేరనప్పుడు, ఎన్నికల వేళ రాజకీయ నేతలు గుప్పించిన 'తప్పుడు వాగ్దానాల' మాటేమిటి? ప్రభుత్వాలపై విమర్శలు చేసేవారిని దోషులుగా నిలబెట్టే చట్టాలు ఉన్నప్పుడు.. అబద్ధపు హామీలతో ప్రజలను వంచించే పాలకులపై చర్యలు తీసుకునే చట్టాల అవసరం లేదా? అన్న ప్రశ్న ఇప్పుడు సమాజం నుండి బలంగా వినిపిస్తోంది. ప్రస్తుత రాజకీయ పరిణామాలను గమనిస్తే, అధికార యంత్రాంగం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి చట్టాలను ఒక ఆయుధంగా వాడుకుంటోందని స్పష్టమవుతోంది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం అంటే ప్రజల సేవకుడు మాత్రమే తప్ప యజమాని కాదు. కానీ నేడు పాలకులు తమను ప్రశ్నించే ప్రతి గొంతును అణచివేయాలని చూస్తున్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వేదికలెక్కి అసాధ్యమైన హామీలను గుప్పిస్తూ, ప్రజలను నమ్మబలికి అధికారాన్ని దక్కించుకుంటున్న నాయకులు, పీఠం ఎక్కిన తర్వాత ఆ వాగ్దానాలను గాలికి వదిలేస్తున్నారు. కోట్లాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలని, పేదలకు ఇళ్లని, రైతులకు గిట్టుబాటు ధరలని చెప్పి అధికారంలోకి వచ్చిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్యమంత్రులు లేదా ప్రధానమంత్రి తమ బాధ్యతలను విస్మరిస్తే వారిపై చట్టం ఎందుకు మౌనంగా ఉంటుంది అన్నది సామాన్యుడి వేదన. ప్రజల ఆశలను ఆసరాగా చేసుకుని తప్పుడు హామీలతో అధికారం పొందడం కూడా ఒక రకమైన మోసమే. మరి ఇలాంటి మోసాలకు పాల్పడే ప్రజాప్రతినిధులపై కేసులు నమోదు చేసే చట్టం ఏది? సామాన్యుడు ఒక సోషల్ మీడియా పోస్ట్ పెడితే క్షణాల్లో స్పందించే వ్యవస్థ, ఏళ్ల తరబడి హామీలను అమలు చేయని పాలకుల విషయంలో ఎందుకు నిర్లిప్తంగా ఉంటోంది? దేశంలో విమర్శించే గొంతును నొక్కే ముందు, వాగ్దానాలు నెరవేర్చని పాలకులను కూడా బోనులో నిలబెట్టే సరికొత్త సంప్రదాయం మొదలవ్వాలి. అప్పుడే అది నిజమైన ప్రజాస్వామ్యం అనిపించుకుంటుంది. ప్రభుత్వం తీసుకువచ్చే జీవోలు లేదా చట్టాలు సమాజ హితం కోసం ఉండాలి కానీ, కేవలం అధికార పీఠాన్ని విమర్శల నుండి కాపాడుకోవడానికి ఉండకూడదు. పాలకులకు ఉండవలసిన స్వేచ్ఛ ప్రజలకు కూడా ఉండాలి. అధికారం అంటే కేవలం అణచివేత కాదు, అది ఒక పవిత్రమైన బాధ్యత. ప్రజల గొంతు నొక్కే జీవోలు తీసుకురావడం కన్నా, ప్రజల బతుకుల్లో వెలుగు నింపే వాగ్దానాలను అమలు చేయడంపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి. తప్పుడు హామీలు ఇచ్చి ప్రజలను వంచించిన పాలకులను వెంటనే శిక్షించే విధంగా, అవసరమైతే అరెస్ట్ చేసే విధంగా కఠినమైన చట్టాలను తీసుకురావాలి. అటువంటి చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత మాత్రమే, ప్రభుత్వానికి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేసే వారిని చట్టం ముందు దోషిగా నిలబెట్టే నైతిక హక్కు ప్రభుత్వానికి లభిస్తుంది. అప్పటివరకు చేసే అరెస్టులు కేవలం రాజకీయ కక్షసాధింపు చర్యలుగానే మిగిలిపోతాయి. ఏ ప్రభుత్వమైనా తన పట్ల వస్తున్న వ్యతిరేకతను చూసి భయపడుతోందంటే, అక్కడ ప్రజాస్వామ్య స్ఫూర్తి కొరవడినట్లే. ప్రజలు తమ సమస్యల గురించి మాట్లాడినప్పుడు అది ప్రభుత్వానికి వ్యతిరేకతగా కాకుండా, దిద్దుబాటు చర్యగా పాలకులు భావించాలి. ఇలాంటి అణచివేత ధోరణి సమాజంలో కొనసాగితే, అది ప్రజల అసంతృప్తిని మరింత పెంచుతుంది తప్ప ఏమాత్రం తగ్గించదు. పాలకుల మీద కేసులు పెట్టే వెసులుబాటు లేని చట్టాలు ఉన్నంత కాలం, సామాన్యులపై మాత్రమే ప్రతాపం చూపే చట్టాలకు విలువేముంటుంది? ఒక సామాన్య పౌరుడు తన వేదనను వ్యక్తం చేస్తే దానిని నేరంగా పరిగణించడం భావప్రకటన స్వేచ్ఛను ఖూనీ చేయడమే. నిజానికి, ఎన్నికల మేనిఫెస్టోలకు చట్టబద్ధత కల్పించాల్సిన సమయం ఆసన్నమైంది. హామీలు నెరవేర్చని పక్షంలో ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకునే నిబంధనలు ఉన్నప్పుడే రాజకీయం పవిత్రం అవుతుంది. ప్రజలకు ఇచ్చిన అమీని అమలు చేయడంలో వెనుకబడిన ప్రభుత్వాల పట్ల న్యాయస్థానాలు కూడా సుమోటోగా స్పందించాలి. స్వేచ్ఛ అనేది కేవలం పాలకులకే పరిమితం కాకూడదు, అది ఈ దేశంలో ఉన్న ప్రతి పౌరుడికి సమానంగా దక్కాలి. ఏదో ప్రజా సమస్య మీద ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నప్పుడు ఇలాంటి కఠినమైన జీవోలు తీసుకురాలేదు కదా అన్న ప్రజల వాదనలో నిజం ఉంది. అధికారంలోకి రాకముందు ఒకలా, వచ్చిన తర్వాత మరొకలా ప్రవర్తించడం పాలకుల ద్వంద్వ నీతిని చాటుతోంది. ప్రశ్నించే గొంతును అణచివేయడం ప్రజాస్వామ్యం కాదు, ప్రశ్న ఉత్పన్నం కాకుండా పరిపాలించడమే అసలైన విజయం. చట్టం ముందు అందరూ సమానమేనన్న రాజ్యాంగ స్ఫూర్తిని పాలకులు కాపాడాలి. పౌరుల హక్కులను కాలరాస్తూ, కేవలం తమ అధికార బలంతో భయానక వాతావరణాన్ని సృష్టించడం సరికాదు. రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛా వాయువులను పౌరులు పీల్చుకోనివ్వాలి. రాజకీయాల్లో జవాబుదారీతనం పెరగాలి. మొదట ప్రజాప్రతినిధులు తమ తప్పులను సరిదిద్దుకోవాలి, తాము ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చాలి. హామీల అమలులో విఫలమైన నాయకులను చట్టం ముందు దోషులుగా నిలబెట్టిన రోజే, సామాన్య ప్రజలకు వ్యవస్థపై నమ్మకం కలుగుతుంది. అప్పటివరకు ప్రజాస్వామ్యం కేవలం మాటలకే పరిమితమవుతుంది తప్ప చేతల్లో కనిపించదు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విమర్శలను స్వీకరించే సహనాన్ని పెంచుకుని, ప్రజల సమస్యల పరిష్కారం దిశగా, ఇచ్చిన హామీల అమలు దిశగా అడుగులు వేయాలి. ప్రజాస్వామ్య మనుగడ అనేది పాలకుల బాధ్యతాయుత ప్రవర్తనపైనే ఆధారపడి ఉంటుంది. పౌరుల గొంతుకను గౌరవించినప్పుడే దేశం పురోగమిస్తుంది.

వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

(02 ఏప్రిల్ "ప్రపంచ ఆటిజమ్ అవగాహన దినం" సందర్భంగా)

# మానసిక ఎదుగుదల లోపంతో ఆటిజమ్ రుగ్మత

సాధారణ పిల్లలు ఏడాది వయస్సులోనే పాకడం, నడవడం, నవ్వడం, ముద్దు ముద్దుగా మాట్లాడడం, తల్లితండ్రుల పిలుపుకు బదులు ఇవ్వడం లాంటివి చేయడానికి ప్రయత్నిస్తూ సఫలం అవుతూ ఉంటారు. కాని కొందరు పిల్లలు మానసిక ఎదుగుదల లోపం కారణంగా అసాధారణం ప్రవర్తన ప్రదర్శిస్తూ ఉంటారు. ఇలాంటి అసాధారణ ప్రవర్తనలో ఆటిజమ్ (మందబుద్ధి లేదా మూగ రుగ్మత) అనే అనారోగ్యం కూడా ఒకటిగా గుర్తించబడింది. వయస్సుకు తగిన మానసిక ఎదుగుదల లేకుండా ఉండే పరిస్థితి బాల్యంలోనే ప్రారంభమై జీవితకాల నాడీ సంబంధ ఆటిజమ్ రుగ్మతగా మారుతుంది. ప్రతి వంద మంది పిల్లల్లో ఒక్కరికి ఈ సమస్య వస్తుంది. పిల్లల మెదడులో కొంత భాగం సరిగా అభివృద్ధి చెందకపోవడం వల్ల ఆటిజమ్ రుగ్మత బయట పడుతుంది. ఆటిజమ్ పెద్ద ప్రమాదకర సమస్య కానప్పటికీ దీనిని నివారించడంలో అనేక సవాళ్లు ఎదుర్కోవలసి వస్తున్నది. మూడేళ్లు నిండక ముందే బయట పడే ఆటిజమ్ లక్షణాలతో మూర్ఛ, నిరాశ, ఆందోళన, హైపర్ ఆక్టివిటీ డిజార్డర్ వంటి రుగ్మతలు ప్రదర్శించబడతాయి.

ప్రపంచ ఆటిజమ్ అవగాహన దినం–2026:

ఆటిజమ్ రుగ్మత పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడానికి, ఆ కుటుంబాలకు బాసటగా నిలువడానికి, ఆటిజమ్ పట్ల అపోహలను తొలగించడానికి ప్రతి ఏట 02 ఏప్రిల్ రోజున "ప్రపంచ ఆటిజమ్ అవగాహన దినం" పాటించుట ఆనవాయితీగా మారింది. 2026 ప్రపంచ ఆటిజమ్ అవగాహన దినం ఇతివృత్తంగా "ఆటిజమ్ మానవీయత – ప్రతి వ్యక్తి జీవితం విలువైనదే (ఆటిజమ్ అండ్ హ్యూమానిటీ ; ఎవ్రీ లైఫ్ హైజ్ వ్యాల్యూ)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. భారత్‌లో ప్రతి 68 మంది పిల్లల్లో ఒక్కరికి ఆటిజమ్ వచ్చే అవకాశాలు ఉన్నట్లు తేలడం విచారకరం. ఇండియాలో దాదాపు 18 మిలియన్ల ఆటిజమ్ రోగులు ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఆటిజమ్ రుగ్మతకు కారణాలు, రోగ లక్షణాలు:

ఆటిజమ్ రుగ్మతను ఆటిజమ్ స్పెక్ట్రమ్ డిజార్డర్ (ఏఎస్‌డి)గా కూడా పిలుస్తారు. ఆటిజమ్ రావడానికి కారణాలుగా జన్యుపరమైనవి, గర్భధారణ సమయంలో ఇన్ఫెక్షన్లు, గర్భిణి తీవ్ర ఉద్రేకానికి గురికావడం, మెదడులో స్రవించే రసాయనాలు తగిన మోతాదులో స్రవించకపోవడం, నెలలు నిండకుండా ప్రసవం కావడం, కుటుంబ సభ్యులు తగిన సమయం ఇవ్వకపోవడం లాంటివి ప్రధానమైనవిగా పేర్కొనబడినవి. ఆటిజమ్ బారిన పడిన పిల్లలు వయసుకు తగిన మానసిక పరిపక్వత చూపకపోవడం, ఒంటరిగా ఉండడం, వ్యక్తుల కళ్లల్లోకి చూడకపోవడం, ఇతరుల పిల్లలతో కలిసి ఆడుకోవడానికి విముఖత చూపడం, చేసిన పనులనే పదే పదే చేయడం, గాయాలు తగిలినా గుర్తించకపోవడం, శబ్దాలను పట్టించుకోకపోవడం, పిలిచినా పలుకకపోవడం, సరిగా మాట్లాడకపోవడం, అకారణంగా ఏడ్వడం లాంటి లక్షణాలను ప్రదర్శిస్తారు.

ఆటిజమ్ పిల్లల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు:

ఆటిజమ్ రుగ్మత బారిన పడిన పిల్లల తల్లితండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవడం కనీస అవసరమని తెలుసుకోవాలి. పిండిపదార్థాలు, కొవ్వులు, మాంసకృత్తులు, జనిత లవణాలు, విటమిన్లు, జింక్, ఐరన్, సెలినియం, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్–ఈ, విటమిన్–కె లాంటి పోషకాలు కలిగిన ఆహారం అందించడం తల్లితండ్రుల బాధ్యత అని మరువరాదు. కాలీఫ్లవర్, బ్రొకోలీ, పెప్పర్, నారింజ, బత్తాయా, పైనాపిల్, స్ట్రాబెరీ, బొప్పాయి, బీన్స్, పుట్టగొడుగులు, పొద్దుతిరుగుడు విత్తనాలు లాంటి పోషకాహారాన్ని అందించాలి. గర్భిణీలు తగు పోషకాహారం తీసుకోవడం, తల్లులు దులవాట్లకు దూరంగా ఉండడం, గర్భిణిలు డాక్టర్ సలహాలు, తల్లులు వాయు కాలుష్యానికి/క్రిమిసంహారక మందులకు దూరంగా ఉండడం, గర్భిణిలు అన్ని రకాల టీకాలను తీసుకోవడం, గర్భంలో శిశువు కదలికల పట్ల వైద్యుల సలహాలు తీసుకోవడం లాంటి జాగ్రత్తలు ఆటిజమ్ సమస్యకు విరుగుదునా పని చేస్తాయని తెలుసుకోవాలి.

పిల్లల ప్రవర్తనను తల్లితండ్రులు నిరంతరం గమనించడం, అసాధారణంగా కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం లాంటి చర్యలు ఆటిజమ్ రుగ్మత తీవ్రతను తగ్గించడంతో లేదా సమస్యను చాలా వరకు పరిష్కరించడం జరుగుతుందనే అవగాహన కలిగి ఉండడం తల్లితండ్రుల కనీస బాధ్యత అని తెలుసుకుందాం, ఆటిజమ్‌కు అవగాహన ఔషధాలతో సమాధానమిద్దాం.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ఈ వేసవిలో మండుటెండలు ఖాయం



### మూడు నెలలు ఎండలు, వడ గాలులు తప్పవు భారత వాతావరణశాఖ హెచ్చరిక

హైదరాబాద్, నినాదం:

రాష్ట్రంలో ఈ వేసవి సీజన్ మొత్తం ఎండ మంట పుట్టించనుంది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు పగటి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదుకానున్నాయని వాతావరణ వాఖ హెచ్చరించింది. రానున్న మూడు నెలలకు దేశంలో వాతావరణ పరిస్థితులు, ఎండలు, వడగాడ్పులు, వర్షాలపై భారత వాతావరణ శాఖ(ఐఎండీ) బులెటిన్ విడుదల చేసింది. వచ్చే మూడు నెలలు రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారే అవకాశం ఉంది. ఏపీతోపాటు ఒడిశా, తెలంగాణలో కొంత భాగం, పశ్చిమ బెంగాల్, బిహార్, యూపీ, ఈశాన్య రాష్టాల్లో పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదుకానున్నాయి. దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం లేదా అంతకంటే తక్కువగా నమోదవుతాయి. ఈ మూడు నెలల్లో ఎక్కువ రోజులు వడగాడ్పులు వీయనున్నాయి. ఏప్రిల్‌లో సగటున మూడు, నాలుగు రోజులు, మే, జూన్ నెలల్లో పది, అంతకంటే ఎక్కువ రోజులు వడగాడ్పులు వీస్తాయి. రాత్రి వాతావరణం కూడా వేడిగానే ఉండనుంది. దేశంలోని 95 శాతం ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదవుతాయి. ఎక్కువ రోజులు వడగాడ్పులు వీస్తాయి. ఏప్రిల్‌లో రాష్ట్రంలోని గోదావరి జిల్లాలు తప్ప మిగిలిన ప్రాంతాల్లో పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదవుతాయి. ఇక ఏప్రిల్‌లో ఈశాన్య రాష్ట్రాలు తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో సగటు కంటే ఎక్కువ వర్షపాతం నమోదుకానుంది. మార్చిలో సాధారణ వర్షపాతం 29.9 మిల్లీ మీటర్లకుగాను 33.7 మిల్లీ మీటర్లు నమోదైంది. 1901 నుంచి ఇప్పటి వరకు మార్చిలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోద వడం ఇది 32వ సారి. పసిఫిక్ మహాసముద్రంలో లానినా చివరిదశకు చేరుకుంది. కొద్దిరోజుల్లో తటస్థ పరిస్థితులకు చేరుకునే అవకాశం ఉందని అంతర్జాతీయ మోడల్స్ వెల్లడిస్తున్నాయి. దీనికి అనుగుణంగా ఏప్రిల్ నుంచి జూన్ వరకు తటస్థ పరిస్థితులు కొనసాగుతాయని, జూన్(నైరుతి రుతుపవనాల ప్రారంభం) నుంచే ఎల్‌నినో మొదలవుతుందని ఐఎండీ అంచనా వేసింది.

# దేశభక్తికి నిలువుటద్దం

## అండమాన్ గడ్డపై అరుదైన గౌరవం పొందిన ధర్మపురి వాసి తెలుగు బిడ్డ

### క్రమశిక్షణే ఆయుధంగా.. సమయ పాలనే ప్రాణంగా: డాక్టర్ గోపాల్ శాస్త్రి జీవన యానం

తెలంగాణలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం ధర్మపురి పుణ్యనేలపై జన్మించి, నమ్మిన విలువల కోసం అహర్నిశలు శ్రమించి, విద్యా–రక్షణ రంగాల మధ్య ఒక బలమైన సేతువుగా నిలిచిన మహోన్నత వ్యక్తిత్వం డాక్టర్ గోపాల్ కెవి శాస్త్రి. ఒక సాధారణ గ్రామీణ వాతావరణంలో అడుగులు వేసి, తన క్రమశిక్షణ, పట్టుదల, మేధస్సుతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (TCS) వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలో కార్యనిర్వాహక ఉన్నతాధికారిగా ఎదగడం ఆయన అసాధారణ ప్రయాణానికి నిదర్శనం. ఆధునిక సాంకేతిక యుగంలో ముంబై కేంద్రంగా సాగిన ఆయన వృత్తి జీవితం కేవలం కార్పొరేట్ విజయాలకే పరిమితం కాలేదు. అడ్మినిస్ట్రేషన్, ప్రాజెక్ట్ మేనేజ్మెంట్, మానవ వనరుల వినియోగంలో ఆయన ప్రదర్శించిన నైపుణ్యం సంస్థాగత వృద్ధికి పీఠం వేయడమే కాక, దేశసేవ పట్ల ఆయనలో ఉన్న అచంచలమైన నిబద్ధతను ఎప్పటికప్పుడు చాటుతూనే ఉంది. సాంకేతిక శిఖరాలను అధిరోహించినప్పటికీ, తన మూలాలను మరువకుండా సమాజ శ్రేయస్సు కోసం ఆయన పడ్డ తపన ఆరాధనీయం.

డాక్టర్ శాస్త్రి జీవితంలో అత్యంత కీలకమైన మరియు హృదయ విదారకమైన ఘట్టం 1993 నాటి మహారాష్ట్ర లోని లాతూర్ భూకంపం. దేశాన్ని కుదిపేసిన ఆ మహా విపత్తు సమయంలో వేలాది మంది ప్రాణాలు కోల్పోగా, లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. అటువంటి సంక్షోభ సమయంలో కేవలం సానుభూతి చూపడమే కాకుండా, క్షేత్రస్థాయిలో పునర్నిర్మాణానికి ఆయన ఒక బృహత్ ప్రణాళికను సిద్ధం చేశారు. విపత్తు నిర్వహణలో సమయపాలన, వనరుల సమర్థ వినియోగం, పక్కా ప్రణాళికాబద్ధమైన పునరావాస చర్యలతో ఆయన రూపొందించిన ప్రాజెక్ట్ ప్రభుత్వానికి, సమాజానికి ఒక దిశానిర్దేశం చేసింది. ఈ నిరుపమాన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం, ఆయనను 'భారత రాష్ట్రపతి అవార్డు'తో సత్కరించడం ఆయన కృషికీ, మానవతా దృక్పథానికీ దక్కిన అత్యున్నత గౌరవం. దేశాధ్యక్షుని చేతుల మీదుగా పురస్కారం అందుకోవడం ఆయన వ్యక్తిగత జీవితంలో చిరస్మరణీయ ఘట్టమే కాక, విపత్తు సమయంలో సామాజిక బాధ్యతను ఎలా నెరవేర్చాలో భవిష్యత్ తరాలకు ఒక పాఠంలా నిలిచింది.

డాక్టర్ శాస్త్రి కేవలం సాంకేతిక నిపుణుడే కాదు, సైనిక క్రమశిక్షణను పుణికి పుచ్చుకున్న యోధుడు. ఎయిర్ వింగ్‌లో ఫ్లైట్ క్యాడెట్‌గా శిక్షణ పొందిన అనుభవం ఆయనలో మొక్కవోని ధైర్యాన్ని, సమయపాలన పట్ల అంకితభావాన్ని నూరిపోశాయి. రక్షణ రంగానికి సంబంధించి ఆయన చేపట్టిన పలు ప్రాజెక్టులు విద్యా, రక్షణ రంగాల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించాయి. ఈ క్రమంలోనే ఇటీవల అండమాన్ నికోబార్ దీవుల్లోని కోశిష్ హాల్‌లో జరిగిన ఒక అపురూప వేడుక ఆయన కీర్తి కిరీటంలో మరో కలికితురాయిగా నిలిచింది. భారత సైన్యానికి చెందిన 19 పంజాబ్, 154 టిఏ బీహార్, 2/4 గోర్ఖా




రైఫిల్స్, 172 టిఏ మద్రాస్ వంటి ప్రసిద్ధ యూనిట్ల కమాండింగ్ అధికారులు, డిప్యూటీ కమాండర్ల సమక్షంలో బ్రిగేడియర్ జి. పి. సింగ్ చేతుల మీదుగా ఆయన "హానర్ ఫర్ ఎక్సలెన్స్ – అంఫిబియన్ యోధ – గౌరవ పతకం" అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కుమారుడు మేజర్ చిన్మయ్ గోపాల్ శాస్త్రి కూడా పాల్గొనడం, ఆ కుటుంబంలో తరతరాలుగా ప్రవహిస్తున్న దేశభక్తికి, కర్తవ్య నిష్ఠకు అద్దం పట్టింది.

ఆ వేదికపై డాక్టర్ శాస్త్రి చేసిన ప్రసంగం ఆలోచింపజేసేదిగా సాగింది. "ఆర్మ్డ్ ఫోర్సెస్‌లో సమయపాలన" అనే అంశంపై ఆయన మాట్లాడుతూ, యుద్ధ క్షేత్రంలో ఒక సెకను కాలం కూడా ప్రాణాలను కాపాడగలదని లేదా ప్రాణాంతకం కాగలదని ఎంతో లోతుగా వివరించారు. సైనిక శిక్షణలో సమయపాలన అనేది కేవలం ఒక నియమం కాదని, అది ఒక జీవన విధానమని ఆయన ఉద్ఘాటించారు. నేటి డిజిటల్ యుగంలో యువత సమయాన్ని వృధా చేస్తున్న తరుణంలో, సైనిక వ్యవస్థలోని క్రమశిక్షణను సామాన్య ప్రజలు కూడా అలవర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రసంగం ముగిసిన తర్వాత అక్కడ ఉన్న సైనిక ఉన్నతాధికారులందరూ లేచి నిలబడి చప్పట్లతో ఆయనకు 'స్టాండింగ్ ఓవేషన్' ఇవ్వడం ఆయన సందేశం ఎంతటి ప్రభావాన్ని చూపిందో తెలియ జేస్తుంది.

ధర్మపురిలో మొదలైన ఒక సామాన్య ప్రయాణం, రాష్ట్రపతి భవన్ మెట్లు ఎక్కి, నేడు అండమాన్ నికోబార్ దీవుల్లో సైనిక వందనం అందుకునే స్థాయికి చేరడం నిజంగా స్ఫూర్తిదాయకం. దేశ రక్షణ, సామాజిక సేవ, వృత్తిపరమైన ఉత్కృష్టత ఈ మూడింటి కలయికే డాక్టర్ గోపాల్ కెవి శాస్త్రి. ఆయన జీవితం రాబోయే తరాలకు నిరంతరం వెలుగునిచ్చే దారిదీపం.

రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్...9440595494

## ఆపదలో ఉన్న వారికి అండగా సీఎంఆర్ఎఫ్




ఎమ్మెల్యే కాలె యాదయ్య

**వికారాబాద్, ఎప్రిల్ 1(నినాదం ):** ఆపదలో ఉన్న నిస్సహా ఓయు ఓలకు సీ ఎం ఎఫ్ ఆర్ ఒక భరోసాగా నిలుస్తుందని చేవెళ్ళ ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. బుధవారం జిల్లా పరిధిలోని నవాబుపేట మండల కేంద్రంలో సీ ఎం ఆర్ ఎఫ్ చెక్కులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ 24 మంది లబ్ధిదారులకు 10 లక్షల 40వేల రూపాయల విలువ గల చెక్కులను పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ సహాయ నిధి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకు లు, వెంకట్మా రెడ్డి, నాగిరెడ్డి, రాజశేఖర్య రెడ్డి, రాములు, సర్పంచ్క బలవంత్ రెడ్డి, కుమార్, నర్సింహారెడ్డి, పాల్గొన్నారు.

## జవహర్‌నగర్‌లో చికెన్ షాపుల యజమానుల నిరసన



**జవహర్ నగర్, ఏప్రిల్ 1(నినాదం):** పౌల్ట్రీ కంపెనీల ఆగడాలకు నిరసనగా జవహర్ నగర్ లోని చికెన్ షాప్ యజమానులు నిరసన తెలిపారు. ఈ మేరకు జవహర్ నగర్ లోని చికెన్ షాపుల యజమానులు సంపూర్ణంగా బుధవారం బంద్ చేపట్టి ర్యాలీగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా చికెన్ షాపుల యజమానులు మాట్లాడుతూ చికెన్ షాపుల నిర్వహణ దినదిన గండంలా మారుతుందని పెట్టుబడి కూడా దక్కడం లేని తమ ఆవేదన వ్యక్తం చేశారు. చికెన్ షాప్ యజమానుల బాధను ప్రభుత్వం పట్టించుకోని గిట్టుబాటు ధర దక్కేలా చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ లోని చికెన్ షాపుల నిర్వాహకులు పాల్గొన్నారు.

## దుబ్బాక బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా 'సంజీవ రెడ్డి'



**దుబ్బాక, ఏప్రిల్1 (నినాదం) :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరిపిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో భాగంగా దుబ్బాక బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా మరిపెద్ది సంజీవ రెడ్డి ఎన్నిక అయ్యారు. బుధవారం ఆయన ఈ సందర్భంగా నూతన బార్ అధ్యక్షుడు సంజీవరెడ్డి ఎన్నికైన సందర్భంగా మాట్లాడుతూ... తనవంతు చేస్తానని, నూతన కోర్టు నిర్మాణంలో తమ వంతు కృషి చేస్తానని, ప్రతి న్యాయ వాది కష్టసుఖాల్లో తోడు ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు చిలుకోటి నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా చిటుకుల అశోక్, జాయింట్ సెక్రెటరీ నెరెండ్ల వెంకటేశ్ గౌడ్, లైబ్రరీ సెక్రెటరీ పెద్దలిశీగన్న బిక్షపతి, న్యాయ వాదులు, బైశీడ్ల చంద్రం, కూరపాటి సంతోష్, శ్రీరాం రామకృష్ణప్రభు, మాడుగుల సంతోష్, ముత్యాల భూపతి, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

## అసెంబ్లీలో డబుల్ బెడ్ రూమ్ సమస్యలపై గళమెత్తిన ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్‌కు ధన్యవాదాలు



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 1 (నినాదం) :** కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బహదూర్ పల్లి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయాల కో ఆపరేటివ్ సొసైటీ సభ్యులు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ 2026-27 సమావేశాల్లో భాగంగా నిర్వహించిన ప్రశ్నోత్తరాలలో " డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాలలోని" సమస్యలపై "కుత్బుల్లాపూర్ ప్రజల గొంతుకై" ప్రభుత్వాన్ని ప్రశ్నించి చర్చ జరిగేలా చేసినందుకు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కా రం, నియోజకవర్గ అభివృద్ధి, ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే తన ధ్యేయమని అన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గ ప్రజలకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ తుడుం పద్మారావు, 2బిహెచ్కే సొసైటీ సభ్యులు దేవ కుమార్, ముస్తఫా, జహంగీర్ భాయ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత క్రైస్తవ అంశంపై తీర్పు పునరా సమీక్షించాలి

### బీఎస్పీ నేత టప్ప భానుచందర్



**చేగుంట మార్చి1 (నినాదం) :** దళిత క్రైస్తవుల అంశం పై నేటి సుప్రీంకోర్టు తీర్పు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం అని బహుజన్ సమాజ్ పార్టీ చేగుంట మండల అధ్యక్షులు టప్ప భానుచందర్ అన్నారు. ఈ తీర్పు భారత, రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 మరియు ఆర్టికల్ 25లను నేరుగా, ఉల్లంఘిస్తున్నది. అని అలాగే భారత ప్రభుత్వం తప్పనిసరిగా, సుప్రీం కోర్టులో, అప్పీల్ దాఖలు చేసి, ఈ తీర్పును రద్దు చేయాలని, బెంచ్‌ను కోరాలని డిమాండ్, చేస్తున్నమని అన్నారు. ఏ మతాన్ని అనుసరించాలనేది ప్రతి పౌరుని వ్యక్తిగత ఇష్టం. దీనిని ఒక నిర్దిష్ట కులంలో జన్మించడం వల్ల వచ్చే హక్కులతో ఎంతమాత్రం ముడిపెట్టకూడదు అని క్రైస్తవం, ఇస్లాం లేదా బౌద్ధం వంటి మతాలకు మారినప్పటికీ, షెడ్యూల్డ్ కులాల వారు ఇప్పటికీ అణచివేతకు గురవుతూనే ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధ కారంచేడు మరియు చుండూరు హత్యాకాండలలో బాధితులంతా చాలా వరకు క్రైస్తవ మతాన్ని అనుసరించిన వారే. ఇది భారతదేశంలో ఈనాటికీ కనిపించే కఠోర వాస్తవం. ఈ తీర్పు క్రైస్తవం లేదా ఇస్లాం మతాలను అనుసరించే లక్షలాది అణచివేతకు గురైన పౌరుల జీవితాలను ప్రమాదంలోపడేసే అవకాశం ఉన్నది. ఇకపై వారు ఎస్సి/ఎస్టి అట్రాసిటీస్ చట్టం కింద రక్షణ పొందడం కష్టం. ఈ సుదీర్ఘకాలిక సమస్యను పరిశీలించడానికి నియమితమైన జస్టిస్ కె.జి. బాలకృష్ణన్ కమిటీ రిపోర్టును బీజేపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తోంది అని ఇది ఒక భారీ కుట్ర అని అన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల కమిటీ పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడితే క్రిమినల్ కేసులు

### పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్చెరు , ఏప్రిల్ 1 (నినాదం) :** నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేస్తున్న క్రమంలో.. ఎవరైనా ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుల పేరుతో ఇల్లు, స్థలాలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామికవాడగా పేరొందిన పటాన్చెరు నియోజకవర్గంలో అత్యధిక శాతం పేద, మధ్యతరగతి ప్రజలు జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో నియోజకవర్గ పరిధిలోని వేల మంది పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అందజేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇళ్ల పేరుతో సొంత స్థలము ఉంటే ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయం, స్థలం లేని వారికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయిస్తోందని తెలిపారు. పూర్తి పారదర్శకతతో అర్హులైన ప్రతి ఒక్కరికి వీటిని అందించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఇందిరమ్మ కమిటీ సభ్యుల పేరుతో కొందరు వ్యక్తులు పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని గ్రామాలు, పట్టణాలు, డివిజన్లలో తిరుగుతూ ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తామంటూ వేల రూపాయలు వసూలు చేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని గృహ నిర్మాణ శాఖ జిల్లా పీడీ చలపతిరావు ను ఆదేశించారు. ఈ అంశంపైన వివిధ మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అక్రమార్కులకు అధికారులు సహకరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని అమీన్పూర్, పటాన్చెరు సర్కిళ్ల పరిధిలో సర్వే జరుగుతుందని.. అతి త్వరలో అర్హులైన వారందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో డిఈ సుజాత, ఏఈ లు పాల్గొన్నారు.

# పొంగులేటికి వత్తాసు పలుకుతున్న ప్రభుత్వం

**ప్రభుత్వ తీరుపై దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఫైర్**



**దుబ్బాక, ఏప్రిల్ 1(నినాదం):** మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అక్రమాలకు బహిరంగంగా వత్తాసు పలుకుతున్న ప్రభుత్వ వైఖరిపై దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. దుబ్బాక లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో ఆయన మాట్లాడారు. నిషేధిత భూముల్లో జరుగుతున్న పొంగులేటి ఆక్రమణలు ప్రజాస్వామ్యానికి, చట్టానికి విరుద్ధమని ఆయన ఘాటుగా విమర్శించారు. ఈ అంశంపై తక్షణమే సమగ్ర నిజ నిర్ధారణ జరపాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు. ప్రభుత్వము మౌనంగా ఉండటం అనేది అక్రమాలకు మద్దతు ఇచ్చినట్టే అవుతుందని, ప్రజల విశ్వాసాన్ని ద్రోహం చేసినట్టే అవుతుందని ఆయన హెచ్చరించారు. ప్రజల భూములు కబ్జా చేయడం సహించేది లేదు...అధికార దుర్వినియోగం చేస్తే చూస్తూ ఊరుకోము నిజం వెలుగులోకి రాకపోతే, న్యాయం జరిగే వరకు పోరాటం ముమ్మరం చేస్తాం" అని ఆయన స్పష్టం చేశారు. ప్రజల హక్కులను కాపాడటంలో ఎలాంటి రాజీ పడబోమని, అవసరమైతే ఉద్యమాలను ఉద్ధృతం చేసి బాధితులకు న్యాయం సాధించేవరకు వెనక్కి పోయేదే లేదని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం చేసేది తక్కువ చెప్పేది ఎక్కువ అన్నట్లు వ్యవహరిస్తుందని ఆయన మండిపడ్డారు. ఉప కాలువలు పూర్తి చేసి సాగునీళ్లు అందేలా కృషి చేయాలిదుబ్బాక నియోజకవర్గం లో ఉప కాలువలు నిర్మించి సాగునీళ్లు అందించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డి కి మరోసారి విజ్ఞప్తి చేశారు.. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కి ఉప కాలువల నిర్మాణంతో పాటు నియోజకవర్గం లోని పలు రోడ్ల నిర్మాణాలకు, అభివృద్ధి నిధుల కోసం లిఖిత పూర్వకంగా విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు..

## సీతారాముల ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

### యువ నాయకులు వంగ రాజేశ్వర్ రెడ్డి



**సిద్దిపేట ఏప్రిల్ 01,(నినాదం):** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం రాంపూర్ గ్రామంలో జరుగుతున్న శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ వార్షికోత్సవ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువ నాయకులు వంగ రాజేశ్వర్ రెడ్డి ఈ సందర్భంగా వంగ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామస్తులు అందరూ ఏకతాటిపై ఉండి ఇలాంటి సంప్రదాయాలను కొనసాగించడం ఎంతో ఆనందంగా ఉందని, పుణ్య దంపతులైన సీతారాముల ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరారు.అనంతరం ఆయన వార్షికోత్సవాల నిర్వహణకు ?15,000 రూపాయల విరాళం అందజే శారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోక మహి పాల్ రెడ్డి,శ్రీనివాస్ గౌడ్,తిరుపతి యాదవ్, మల్లారెడ్డి, సూర్యం రెడ్డి, నాంపల్లి వెంకటేష్, యాదగిరి,రంజిత్, భూపతి రెడ్డి,తిరుపతి యాదవ్,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో నాలా పూడికతీత పనులు



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 1 (నినాదం):** జీడిమెట్ల సర్కిల్ల్లో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి సంబంధించి ప్రతిరోజు షెడ్యూల్ ప్రకారం 27వ రోజు కార్యక్రమంలో భాగంగా నాలాలోని పూడిక`తీత పనులు చేపట్టారు. ఇందులో భాగంగా వార్డ్ నెంబర్ 286-కుత్బుల్లాపూర్ అయోధ్యా నగర్ ఓపెన్ నాలా లోని పూడికతీత పనులు చేయించారు.

## పరిగి సబ్ జైలులో వైద్య శిబిరం



**వికారాబాద్, ఎప్రిల్ 1(నినాదం) :** తెలంగాణ ప్రభుత్వ 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం పరిగి సబ్ జైలు నందు జైలు సూపరింటెండెంట్ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో సాయి డెంటల్ హాస్పిటల్, కాలేజ్ , వికారాబాద్ సహకారంతో జైలులో వైద్య శిబిరం నిర్వహించారు. ముద్దాయిలకు, సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జైలు సూపరింటెం డెం టట్ రాజ్ కుమార్ మాట్లాడుతూ ఖైదీల ఆరోగ్య పరిరక్షణ ప్రాథమిక కర్తవ్యమని ఇట్టి కార్యక్రమానికి ప్రైవేటు హాస్పిటల్స్ సహకరించి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి డెంటల్ హాస్పిటల్ పిఆర్ఓ రవీందర్ గౌడ్, వైద్యులు వివేక్, శిశ్య ప్రియ, కేజియా, గాయత్రి దేవి, జైలు హెడ్ వార్డర్ జి. బి. విశ్వనాథ రావు, వార్డర్స్ శ్రీను, హరికృష్ణ, మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్ అభివృద్ధికి కీలక అడుగు

**బహదూర్ పల్లి జూలపల్లి ఫారెస్ట్ రోడ్డును పరిశీలించిన కొలను హనుమంత రెడ్డి**





**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 1 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి కీలక అడుగు పడిందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హనుమంత రెడ్డి తెలిపారు. బహదూర్ పల్లి-దూలపల్లి ఫారెస్ట్ రోడ్డును పరిశీలించి, ప్రజా శ్రేయస్సు, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు హనుమంత రెడ్డి పేర్కొన్నారు. బహదూర్ పల్లి నుంచి దూలపల్లి వరకు ఉన్న ఫారెస్ట్ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను ప్రారంభించడంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ రోడ్డు అభివృద్ధి పూర్తయితే పరిసర గ్రామాల ప్రజలకు రాకపోకలు సులభమవుతాయని పేర్కొన్నారు.కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడతామని కొలన్ హన్మంత్ రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ గౌరీష్, మాజీ సర్పంచ్ మైసగిరి శ్రీనివాస్, మన్నె రాజు (చైర్మన్, ఫిషరీస్ -- మేడ్చల్ జిల్లా), మాజీ వైస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, మాజీ కో-ఆప్షన్ మెంబర్ సయ్యద్ రషీర్, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, ప్రసన్న కుమార్, కుమార్ యాదవ్, సాదు యాదవ్, వేణు, దుద్దు రాహుల్, శివకుమార్ గౌడ్, ప్రశాంత్ కుమార్ గౌడ్, సాయి కుమార్ యాదవ్, పండరీరావు, నరేందర్ (రాజు), మోహన్, మల్లేష్, శ్రవణ్ కుమార్, వెంకటేశ్వరరావు, అకోడే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# నాడైనా.. నేడైనా.. ఎప్పుడైన అన్నింటా అగ్రగామి సిద్దిపేట

**కాళేశ్వరం ప్రాజెక్టు వల్లే సిద్దిపేట పల్లెలకు వలస కార్మికులు**

**వ్యవసాయంతో పాటు ఐటీ, పారిశ్రామిక రంగాల్లోనూ సిద్దిపేట అభివృద్ధి పరుగు**

**మాజీ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు**





**సిద్దిపేట ఏప్రిల్ 01,(నినాదం):** సిద్దిపేట పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ మీకు నా వంతు సహాయంగా, ఉడుతా భక్తిగా ఈ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక సీఎం రిలీఫ్ ఫండ్ మన సిద్దిపేట నియోజకవర్గంలోనే ఇవ్వడం జరిగిందన్నారు. 12,857 మందికి రూ. 41 కోట్ల 13 లక్షల రూపాయల సాయం చేశామన్నారు. ఈరోజు కూడా 300 మందికి రూ. 62 లక్షల 88 వేల చెక్కులు అందిస్తున్నామన్నారు.. సిద్దిపేట లో ఏ పల్లెలో చూసినా కాలువల్లో గోదావరి నీళ్లు గలగలా పారుతున్నాయి, మండు టెండల్లో చెరువులు మత్తడి దుంకుతున్నాయి, పచ్చని పొలాలు కనబడుతున్నాయి.అన్నారు. ఎండాకాలంలో కూడా మన సిద్దిపేటలో 85 వేల ఎకరాల్లో వరి ధాన్యం పండిస్తున్నారు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు మనకు నిజంగా ఒక వరం. ఆ కాళేశ్వరమే లేకపోతే మన సిద్దిపేట ఇలా ఉండేదా అని ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. అని అన్నారు. ఆయిల్ పామ్ తోటలు పెట్టి లాభాలు పొందుతూ, బాగుపడుతుంటే ఎంతో సంతోషంగా ఉందన్నారు. వ్యవసాయంతో పాటు ఉపాధి కోసం మిట్టపల్లి ఇండస్ట్రియల్ కారిడార్‌లో కొన్ని పరిశ్రమలు తెచ్చామన్నారు.రాబోయే రోజుల్లో కూడా అందరం కలిసికట్టుగా పనిచేసి సిద్దిపేటను అగ్రగామిగా నిలుపుకుందామని సూచించారు ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కడవెరుగు రాజనర్స్, కౌన్సిలర్లు , సర్పంచులు , బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# పటాన్‌చెరులో రాజకీయ వాగ్వాదం తీవ్రం

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిపై కాట శ్రీనివాస్ గౌడ్ తీవ్ర విమర్శలు**

**భూ వ్యవహారాలపై ఆరోపణలు, ప్రమాణానికి సవాల్**

**సర్వే నంబర్లపై వివాదం, అవినీతి ఆరోపణల వెల్లడి**



**పటాన్చెరు, ఏప్రిల్ 1,(నినాదం ):** నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం ఉద్రిక్తంగా మారింది. మీడియా సమావేశంలో కాట శ్రీనివాస్ గౌడ్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. స్థాయి గురించి మాట్లాడే హక్కు నీకు లేదని, ప్రజా ప్రతినిధిగా వ్యవహరించే తీరు సరైనది కాదని విమర్శించారు. దొంగల గురించి మాట్లాడటం సమంజసం కాదని తాను ముందుగానే హరీశ్ రావుకు తెలిపినట్లు పేర్కొన్నారు.తమ కుటుంబం ఆస్తులను అమ్ముకుని పేదలకు అండగా నిలిచిందని, చరిత్ర కలిగిన కుటుంబంపై అనవసర ఆరోపణలు చేయడం తగదని చెప్పారు. తమ కుటుంబం పేరుతో పలు కాలనీలు ఉన్నాయని గుర్తు చేశారు. మూడు సార్లు గెలిచినా రాజకీయ అవగాహన లేదని, ప్రజా సేవ కంటే వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. భూ వ్యవహారాలపై కూడా కాట శ్రీనివాస్ గౌడ్ పలు ఆరోపణలు చేశారు. కొన్ని సర్వే నంబర్లలో ప్లాట్లు ఏర్పాటు చేసి అమ్మకానికి సిద్ధం చేస్తున్నారని, అక్రమంగా భారీ మొత్తంలో సంపాదిస్తున్నారని అన్నారు. 62, 64, 65, 453, 178 సర్వే నంబర్లకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని వెల్లడించారు. అక్రమంగా పొందిన ఆస్తులను ప్రజల ముందు బయటపెడతామని హెచ్చరించారు.ఇద్దరి ఆస్తులను బహిరంగం చేయాలని సవాల్ విసిరిన ఆయన, ఆరోపణలు నిజమని భావిస్తే ఆలయంలో ప్రమాణం చేయాలని ఆహ్వానించారు. బీరంగూడలో శివాలయంలో నిర్దిష్ట సమయంలో ప్రమాణం చేయడానికి సిద్ధమా అని ప్రశ్నించారు. తాను తీసుకున్న వైఖరిలో తప్పు లేదని, అవసరమైతే ఎంతదూరమైనా వెళ్లడానికి సిద్ధమని స్పష్టం చేశారు.రాజకీయ ప్రయోజనాల కోసం పార్టీలు మారడం, ప్రజా స్థలాలపై దుర్వినియోగం చేయడం వంటి అంశాలను తీవ్రంగా ఖండించారు. వచ్చే రోజుల్లో అవినీతి విషయాలను మరింతగా బయటపెడతామని తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ పైన ఎందుకంత కక్ష

**ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాటల్లో నిజం లేదు**

**మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగుల మల్లేశం గౌడ్**



**కొల్చారం ఏప్రిల్ 1( నినాదం) :** సింగూర్ నుండి ఘనపూర్ ఆయకట్టు కు నీటి విడుదలను కొల్చారం స్థానిక మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అడ్డుకుంటున్నారు అని నర్సాపూర్ శాసనసభ్యురాలు సునీతా లక్ష్మారెడ్డి గారు నిన్న తుక్కాపూర్ వచ్చిన సందర్భంలో స్థానిక టిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఆరోపించడం జరిగింది. ఈ పత్రిక ముఖంగా స్థానిక టిఆర్ఎస్ నాయకులకు స్థానిక శాసన సభ్యురాలు సునీత లక్ష్మారెడ్డి గారికి మేము ఒకటే సూటిగా ప్రశ్నిస్తున్నాం.. గతంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు సునీత లక్ష్మారెడ్డి చొరవుతోనే సింగూర్ నుండి ఘనపూర్ కు నీళ్లు విడుదల చేస్తున్నామన్న ఘనత తమరికే దక్కిందని వారే కొల్చారం మండల కేంద్రంలో ప్రెస్ మీట్ పెట్టి మరి సంబరాలు చేశారు. గతంలో మంత్రిగా చేసిన అనుభవం ఉన్న స్థానిక ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి గారికి మరి ఆర్డర్ రిలీజ్ అయినాక ఎన్ని రోజులలో నీళ్లు వస్తాయి కూడా వారికి అనుభవం ఉంది దయచేసి అది ఎక్కడ జాప్యం జరుగుతుందో తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందని సందర్భంగా వారిని అడుగుతున్నాం మీ చొరవతో నీళ్లు విడుదలైన అని చెప్పిన నాయకులు ఈరోజు అదే నోటితో నీళ్లు స్థానిక కాంగ్రెస్ నాయకులు అడ్డుకుంటున్నారని ఆరోపిస్తున్నారు మీ మాటల్లో ఎంత నిజం ఉందని ప్రజలు గమనిస్తారు మంచి అయితే మీరు చెడైతే కాంగ్రెస్ పార్టీ మీద వేయడం మీకు అలవాటు అయిపోయింది దయచేసి మీ పద్ధతి మార్చుకోండి రైతుల పక్షపాతి కాంగ్రెస్ పార్టీ ఎన్నడూ కూడా రైతులు ఇబ్బంది పెట్టే పార్టీ కాంగ్రెస్ పార్టీ కాదు రైతులకు బోనస్ ఇచ్చి ఆదుకున్న మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు రైతు బాంధవుడు మీరు రైతులకు నడిరోడ్లపై సంకెళ్లు వేసి తీసుకెళ్లి చరిత్ర మీది మీ దీ-నా పార్టీది ఇవన్నీ మర్చిపోయి ఈరోజు ఒక మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సింగూరు నీళ్లు ఆపుతున్రని ఆరోపించడం మీ విజ్ఞతకే వదిలేస్తున్నాం. మీ కార్యకర్తలే నాయకులే చెప్పుకున్నారు నీళ్లు వస్తేనేమో ఎమ్మెల్యే గారి ఘనత నీళ్లు రాకపోతే నేమో స్థానిక కాంగ్రెస్ నాయకుల ఆపుతున్నరని ఆరోపణ ఇదేనా మీ రాజకీయం. దయచేసి ఇప్పటికైనా ఇలాంటి లేనిపోని ఆరోపణపనులు మానుకోండి. అబద్ధాలు చెప్పి ప్రజల ను మభ్య పెట్టాలని చూస్తే చూస్తూ ఊరుకో. ప్రజలను మభ్యపెట్టి ప్రజల మధ్యన మేమున్నాం ప్రజల కోసం రైతుల కోసం మేము మాట్లాడుతున్నామని మాయలో నుంచి బయటకు రండి నిజాలు మీరు ఎన్ని రోజులు ఆపి పెట్టినా అవి ఆగవు త్వరలోనే మా నాయకులు నరసాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి గారితో సమావేశమై సింగూర్ నీళ్ల గురించి సంబంధిత నీటిపారుదల శాఖ మాత్యు లను జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు కలిసి త్వరలో నీటి విడుదలకు కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని ఇది రైతులు గమనించాలి . కొల్చారం మండల ప్రజలు గమనించాలి రాజకీయ పబ్బం కోసం లేనిపోని ఆరోపణ చేస్తే ఊరుకునేది లేదు దయచేసి ఇలాంటి ఆరోపణ చేసే ముందు దాని వెనుక నిజము తెలుసుకొని మాట్లాడితే మంచిదని స్థానిక బి ఆర్ ఎస్ నాయకులకు ఎమ్మెల్యే గారికి కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ పక్షాన హెచ్చరిస్తున్నాం.



## అంత్యపుష్కరాల ఏర్పాట్ల పనుల్లో

# వేగం పెంచాలి

## కలెక్టర్ రాహుల్ శర్మ

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవ్‌పూర్ మండలం కాళేశ్వరంలో మే 21 నుంచి జూన్ 01వరకు జరుగనున్న సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్ల పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో సరస్వతి అంత్య పుష్కరాల పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పుష్కరాల సమయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా ఘాట్ల అభివృద్ధి, రహదారుల మరమ్మతులు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. రెవెన్యూ, దేవాదాయ, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, విద్యుత్, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులు కేటాయించిన పనులను సమన్వయంతో నిర్వహించి, నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పుష్కరాల సందర్భంగా భక్తుల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నిర్వహణ, భద్రతా చర్యలు, వైద్య సదుపాయాలు కూడా సమర్థవంతంగా ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఇరిగేషన్, పీఆర్, విద్యుత్, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రూ . 15000 లంచం తీసుకుంటూ

# ఏసీబీకి చిక్కిన ఏఎస్ఐ

**ఎల్బీనగర్, ఏప్రిల్ 1 (నినాదం)**
మల్కాజ్గిరి కమిషనరేట్ చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై బాలయ్య అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వలలో చిక్కారు..! కాంప్రమైజ్ అయిన మహిళా వేధింపుల కేసును రంగారెడ్డి జిల్లా కోర్టులో లోక్ అదాలత్ ద్వారా క్లోజ్ చేయించడానికి రూ.15 వేల లంచం డిమాండ్ చేశారు..ఈ కేసు కాంప్రమైజ్ అయిన అనంతరం దాన్ని లోక్ అదాలత్ ద్వారా క్లోజ్ చేయించడానికి ఏఎస్సై బాలయ్య లంచం డిమాండ్ చేశారు. బాధితుడు పల్లపు రాంబాబు ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా.. అధికారులు ముందస్తుగా ట్రాప్ ఏర్పాటు చేసి కోర్టు ప్రాంగణంలోనే బాలయ్య లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ఆయనను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.



## మీ పిల్లలకు కూడా భోజనం

# ఇలానే పెడతారా?

## భవిష్యత్‌లో నిర్లక్ష్యం పునరావృతమైతే కఠిన చర్యలు

- మెనూ ప్రకారం భోజనం అందించాల్సిందే..!!
- మధ్యాహ్న భోజన నాణ్యతపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం
- ఎస్టీ బాలుర ఉన్నత పాఠశాల సిబ్బందికి హెచ్చరిక
- దమ్మపేట మండలంలో విస్తృత పర్యటన
- తహశీల్దార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ..

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఏప్రిల్01(నినాదం)**
జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం దమ్మపేట మండలంలో విస్తృత పర్యటన నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం, పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న సేవలు, విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలపై సమగ్రంగా పరిశీలించారు. మొదట తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, దరఖాస్తుల పరిష్కార ప్రక్రియపై అధికారులను ప్రశ్నించారు. కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు, రేషన్ కార్డుల దరఖాస్తులు నిర్ణీత గడువులో పరిష్కరించాలని ఆదేశించారు. "మీ సేవ" రుసుముల వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. మండల స్థాయిలోనే పరిష్కరించాల్సిన సమస్యల కోసం ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తరువాత తెలంగాణ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలించిన కలెక్టర్, మధ్యాహ్న భోజన నాణ్యతను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం చికెన్ బగారా రైస్ ఇవ్వాల్సి ఉండగా అందించకపోవడం, వండిన ఆహారం నాణ్యత లోపించడం గమనించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "మీ పిల్లలకు కూడా ఇలానే భోజనం పెడతారా?" అని ప్రశ్నిస్తూ, భవిష్యత్తులో నిర్లక్ష్యం పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు చేతులు కడుక్కునే ప్రదేశంలో ట్యాప్‌లు లేకపోవడంతో నీరు వృథా అవుతున్న పరిస్థితిని గమనించి వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. అనంతరం మరో సంక్షేమ పాఠశాలను సందర్శించిన కలెక్టర్, అక్కడ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతున్నందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడి సదుపాయాలపై సమాచారం తెలుసుకున్నారు. వంటశాల, నిల్వ గదులను పరిశీలించి ఆహార పదార్థాల నాణ్యత, భద్రతా ప్రమాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోషకాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ సూచించారు. పర్యటనలో తహసీల్దార్ రామ్ నరేష్, ఎంపీడీవో రవీందర్ రెడ్డి, ఎంఈఓ జగదీష్, ఎస్టీ బాలుర హాస్టల్ సిబ్బంది వార్డెన్ దుర్గా, హెచ్ఎం స్టెల్లా తదితర అధికారులు పాల్గొన్నారు.





# ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత రానివ్వొద్దు

## కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల ప్రతినిధి ఏప్రిల్ 1 (నినాదం)**
ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఇసుక కొరత లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ అలంపూర్ తహసిల్దార్ కార్యాలయంలో పలువురు అధికారులతో సమావేశమై మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు అధిక ధరలు చెల్లించి ప్రైవేట్ వ్యక్తుల నుంచి ఇసుక కొనుగోలు చేయవద్దని, ప్రభుత్వం నుంచి నిబంధనల ప్రకారం కొనుగోలు చేసేలా సంబంధిత అధికారులు లబ్ధిదారులకు సహకరించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం కావాలని, ప్రభుత్వ లక్ష్యం మేరకు నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. సెన్సస్ పై ఇప్పటికే జిల్లాలో కార్యకలాపాలు మొదలయ్యాయని, సంబంధిత అధికారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ముందుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ తహసిల్దార్ కార్యాలయంలో రికార్డు గది, ఇతర పలు విభాగాలను పరిశీలించారు. అనంతరం అలంపూర్ మున్సిపల్ కార్మికులు తమకు పెండింగ్ లో ఉన్న జీతాలను ఇప్పించాలని కలెక్టర్ ను కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. నిర్మాణంలో ఉన్న పలు ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు.అలాగే అలంపూర్ లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డులో తిరుగుతూ పలువురు రోగులు, సహాయకులతో మాట్లాడారు. ఫార్మసీ, ఎక్స్రే, డయాలసిస్ యూనిట్, తదితర విభాగాలను పరిశీలించారు. హాజరు రిజిస్టర్ తో పాటు పలు రికార్డులను పరిశీలించారు. ఓపిల సంఖ్య పెరగాలని, సబ్ సెంటర్స్ నుంచి రోగులను రెఫర్ చేయాల్సి వస్తే ప్రభుత్వ ఆసుపత్రులకే పంపించేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు. టాయిలెట్స్ గదులు, శుభ్రంగా ఉంచాలని,అన్నారు.







## సల్మాన్‌కు జోడీగా

# నయన్

బాలీవుడ్ అగ్ర కథానాయకుడు సల్మాన్ ఖాన్‌తో దర్శకుడు వంశీ పైడిపల్లి ఓ చిత్రం తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు నిర్మిస్తున్నారు. ఇందులో నయనతార కథానాయికగా నటించనున్నట్లు ఇప్పటికే వార్తలొచ్చాయి. ఈ విషయాన్నే చిత్ర బృందం మంగళవారం అధికారికంగా ప్రకటించింది. యాక్షన్ ప్రాధాన్య చిత్రంగా భారీ స్థాయిలో నిర్మితం కానున్న ఈ సినిమా ఈనెలలోనే రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించుకోనుంది. వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.

NINADAM CINEMA

## విశ్రాంతి కోసం

# విదేశాలకు ప్రభాస్

టాలీవుడ్ డార్లింగ్, పాన్-ఇండియా స్టార్ ప్రభాస్ వరుస షఉటింగ్‌ల నుంచి చిన్న విరామం తీసుకున్నారు. ప్రభాస్ తన తదుపరి చిత్రాలపై మరింత జాగ్రత్తగా, పూర్తి ఫోకస్‌తో పని చేస్తున్నారు. ప్రస్తుతం చేతినిండా ప్రాజెక్టులతో బిజీగా ఉన్న డార్లింగ్, కొద్ది రోజులు విశ్రాంతి అవ్వడానికి వెకేషన్‌కు రెడీ అయ్యారు. నిర్విరామంగా షఉటింగ్స్‌లో పాల్గొంటున్న ఈ పాన్ ఇండియా స్టార్, వేసవి సెలవుల కోసం ఇటలీకి బయలుదేరారు. తాజాగా బేగంపేట విమానాశ్రయం నుంచి ఆయన ఇటలీకి పయనమయ్యారు. అక్కడ కొద్ది రోజులు ప్రశాంతంగా గడిపిన తర్వాత మళ్లీ హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. విరామం తర్వాత ఆయన నేరుగా సెట్స్‌లోకి అడుగుపెట్టనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ప్రభాస్ చేతిలో బాక్సాఫీస్‌ను షేక చేసే రేంజ్‌లో ఉన్న సినిమాలు ఉన్నాయి. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఫౌజీ అందులో ఒకటి. ఈ పీరియడ్ యాక్షన్ డ్రామాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఈ ఏడాది చివర్లో ఈ సినిమా విడుదలయ్యే అవకాశం ఉందని సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతుంది. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్న చిత్రం స్పిరిట్. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. కల్కి సీక్వెల్ షూటింగ్ ప్రారంభమైనప్పటికీ, ప్రభాస్ వెకేషన్ నుంచి రాగానే కీలక షెడ్యూల్స్ ప్రారంభం కానున్నాయని టాక. బాక్సాఫీస్ వద్ద 'రాజా సాబ్' ఫలితం ప్రభాస్ అభిమానులను కొంత నిరాశపరిచినప్పటికీ, రాబోయే సినిమాల లైనప్ చూస్తుంటే డార్లింగ్ మళ్లీ బాక్సాఫీస్ వద్ద వసూళ్ల సునామీ సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.





## సరికొత్త రికార్డుల దిశగా

# దురంధర్-2

రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్: ది రివెంజ్' బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డుల దిశగా దూసుకుపోతోంది. వసూళ్లలోనే కాకుండా, థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య (ఫుట్‌ఫాల్స్) విషయంలో కూడా ఈ సినిమా బాలీవుడ్‌లో సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చిత్రం ఇండియాలో 3 కోట్ల ఫుట్‌ఫాల్స్‌ను దాటేసింది. కరోనా తర్వాత ఈ ఘనత సాధించిన ఆరో హిందీ చిత్రంగా 'ధురంధర్ 2' నిలిచింది. గతంలో 'గదర్ 2', 'జవాన్', స్త్రీ 2, ఛావా, 'ధురంధర్' మొదటి భాగం మాత్రమే ఈ మార్కును చేరుకున్నాయి. ప్రస్తుతం హిందీ వెర్షన్లలో అత్యధిక ఫుట్‌ఫాల్స్ సాధించిన చిత్రంగా 'పుష్ప 2' (దాదాపు 4 కోట్లు) కొనసాగుతోంది. అయితే, 'ధురంధర్: ది రివెంజ్' హవా చూస్తుంటే.. ఫుల్ రన్ ముగిసే సమయానికి అన్ని భాషల్లో కలిపి 5 కోట్ల ఫుట్‌ఫాల్స్‌ను సాధించే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి.

# సెట్స్‌లో నటి పట్ల అసభ్య ప్రవర్తన

## మళయాళ దర్శకుడు రంజిత్ అరెస్ట్

ప్రముఖ మలయాళ దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్‌ను లైంగిక వేధింపుల ఆరోపణలపై కొచ్చి పోలీసులు అరెస్ట్ చేశారు. ఒక యువ నటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎర్నాకుళం సెంట్రల్ పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఒక సినిమా సెట్‌లో రంజిత్ తనతో అనుచితంగా ప్రవర్తించారని ఇటీవల ఓ నటి ఫిర్యాదు చేసింది. ఈ ఆరోపణల నేపథ్యంలో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ప్రాథమిక విచారణ కోసం కొచ్చికి తరలించారు. బాధితురాలు పోలీసులను ఆశ్రయించడానికి ముందు, చిత్ర యూనిట్‌లోని అంతర్గత ఫిర్యాదుల కమిటీకి ఫిర్యాదు చేశారు. కమిటీ సభ్యులు దానిని పరిశీలించి, అది తీవ్రమైన అంశంగా గుర్తించడంతో తదుపరి చర్యల కోసం కేసును కేరళ పోలీసులకు బదిలీ చేశారు. హేమ కమిటీ నివేదిక వెలువడిన తర్వాత మలయాళ సినీరంగంలో బయటపడుతున్న వరుస వేధింపుల కేసుల్లో ఇది మరొకటి కావడం గమనార్హం. గతంలోనూ రంజిత్‌పై ఇలాంటి ఆరోపణలు వచ్చాయి. 2024లో బెంగాలీ నటి చేసిన వేధింపుల ఆరోపణల వల్ల ఆయన తన కేరళ చలనచిత్ర అకాడమీ ఛైర్మన్ పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది.



## 10న వస్తున్న

# లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ

తమిళ యువ హీరో ప్రదీప్ రంగనాథన్ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో తెరకెక్కిన సరికొత్త చిత్రం 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'. ఈ సినిమాలో టాలీవుడ్ బ్యూటీ కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే సెన్సార్ పనులు పూర్తి చేసుకుని సర్టిఫికెట్ అందుకున్న ఈ చిత్రం, అనేక వాయిదాల తర్వాత ఏప్రిల్ 10న తమిళంతో పాటు తెలుగులోనూ గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఈ సందర్భంగా తెలుగులో టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ టీజర్ విషయానికి వస్తే.. ఇది 2040వ సంవత్సరం నేపథ్యంలో సాగే ఒక ఆసక్తికరమైన ఫ్యూచరిస్టిక రొమాంటిక డ్రామాగా కనిపిస్తోంది. ప్రస్తుత కాలంలోని ఇన్‌స్టంట్ రిలేషన్ షిప్స్‌ను ఇష్టపడని హీరో(ప్రదీప్ రంగనాథన్) హీరోయిన్ (కృతి శెట్టి), పాతకాలం నాటి స్వచ్ఛమైన ప్రేమను కోరుకుంటారు. అయితే వీరి ప్రేమకథకు ఎస్. జె సూర్య ఎలా అడ్డుపడతాడు. ఎస్. జె సూర్య నడుపుతున్న 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' అనే సంస్థ ఉద్దేశ్యం ఏంటి అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ఇందులో ప్రేమ గురించే కాకుండా 2040లో ఏం మార్పులు రాబోతున్నాయి అనే చిన్న చిన్న విషయాలను కూడా చాలా చక్కగా చూపించారు మేకర్స్. యోగి బాబు, సీమన్, గౌరీ కిషన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నఈ చిత్రాన్ని లేడీ సూపర్ స్టార్ నయనతారతో కలిసి ఎస్.ఎస్. లలిత్ కుమార్ నిర్మించారు.



## బిజీ షెడ్యూల్ వల్లనే డ్రాగన్‌లో

# నటించలేకపోయా

## మళయాళ నటుడు టొవినో థామస్ వెల్లడి

టాలీవుడ్ హీరో ఎన్టీఆర్– కన్నడ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో 'డ్రాగన్' సినిమా తెరకెక్కుతోంది. ఇందులో ఓ పాత్ర కోసం మలయాళ నటుడు టొవినో థామస్‌ని చిత్ర బృందం ఎంపిక చేయనున్నట్లు ఇటీవల వార్తలొచ్చిన సంగతి తెలిసిందే. వీటిపై టొవినో స్పందించారు. తన కొత్త సినిమా 'పళ్లిచట్టంబి' ప్రమోషన్స్‌లో భాగంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో క్లారిటీ ఇచ్చారు. మలయాళంలో వేరే సినిమాలు చేస్తుండటంతో.. డేట్స్ సర్దుబాటు కాక 'డ్రాగన్'లో నటించట్లేదని తెలిపారు. 'తెలుగు సినిమాల్లో నటించాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. మలయాళంలో వర్కింగ్ కల్చర్ టాలీవుడ్‌కు భిన్నంగా ఉంటుంది. తక్కువ సమయంలోనే షఉటింగ్ పూర్తి చేస్తాం. తెలుగు చిత్రాల షఉటింగ్ షెడ్యూల్స్ ఎక్కువ ఉంటాయి. పైగా ఒకేసారి రెండు/మూడు చిత్రాల్లో నటించడం నాకు ఇష్టం ఉండదు. ఒక సినిమా పూర్తయ్యాకే మరో సినిమా చేస్తుంటా. ఒకవేళ నేను టాలీవుడ్‌లో ఓ పెద్ద సినిమాలో నటిస్తే.. నేను అంగీకరించిన మూడు/నాలుగు మలయాళ చిత్రాలపై ప్రభావం పడుతుంది. అందుకే తెలుగు సినిమాల్లో నటించలేకపోతున్నా' అని వివరించారు. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహించిన 'పళ్లిచట్టంబి' ఏప్రిల్ 10న తెలుగులోనూ విడుదల కానుంది.



Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S)
Published at Plot S11, 3rd Floor, Ballard Estate Margadarshi Building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787